Follow: @ANNTELUGU
28-04-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 146 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## రక్తం మరుగుతోంది
### మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ
భారతీయులకు ప్రపంచం అండగా నిలుస్తోంది
బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాం

**ఢిల్లీ. మహా:** జమ్మూ కశ్మీర్ పహల్గామ్ లో 26మంది పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల కిరాతక చర్యపై ప్రధాని మోడీ ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంంలో ప్రస్తావించారు. నా గుండెల్లో తీవ్ర బాధ ఉంది. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద సంఘటన దేశంలోని ప్రతి పౌరుడిని బాధపెట్టింది. ఈ ఉగ్రవాద దాడి చిత్రాలను చూసిన తర్వాత ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతోందని నాకు తెలుసు. పహల్గామ్‌లో జరిగిన ఈ దాడి ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నిరాశను, వారి పిరికితనాన్ని చూపిస్తుంది. ఉగ్రవాదులు, దాని వెనుక ఉన్నవారు కశ్మీర్ మళ్ళీ నాశనం కావాలని కోరుకుంటున్నారు. అందుకే వారు ఇంత పెద్ద కుట్ర చేశారు.

మిగతా 3లో

**టాప్ న్యూస్**

### ఈ వందల కోట్ల ధన ప్రవాహం ఎక్కడిది?


- కళ్లు బైర్లు కమ్మే ఈ సభ ఏర్పాట్ల సొమ్ము ఎక్కడిది?
- కూలిన కాళేశ్వరందా? ధరణి దోపిడీ సొమ్మా?
- బిల్డర్ల దగ్గర దోచిన అదనపు ఫ్లోర్ల సొమ్మా?
- బీఆర్ఎస్ పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నల వర్షం

02

### ఈడి అధికారులకు మహేష్ బాబు ట్విస్ట్


- ఇపుడు రాలేను.. మరో డేట్ ఇవ్వండంటూ మెయిల్
- షూటింగ్ ఉన్నందున రాలేనంటూ వివరణ

02

### భారత్‌పై దాడి చేసేందుకే 130 అణుబాంబులు సిద్ధం


- పాక్ మంత్రి హనీఫ్ అబ్బాసీ ప్రేలాపనలు
- సింధూ జలాలను నిలిపివేస్తే పూర్తి స్థాయి యుద్ధానికి సిద్ధం


07



## సీఎం రేవంత్‌రెడ్డి తో మహిళా, బాలల హక్కుల కమిషన్ సభ్యులు భేటీ

**మహా :** సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి సీతక్క, మహిళా కమిషన్, బాలల హక్కుల కమిషన్ సభ్యులు ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులను అభినందించి, సన్మానించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసి కమిషన్ కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

మిగతా 3లో





# తెలంగాణకు విలన్ నెంబర్ వన్ కాంగ్రెస్సే

### పోలీసులు డైరీల్లో రాసిపెట్టుకోండి..
## మళ్ళీ మేం వస్తాం
ఇకపై బయటకు వస్తా.. ప్రజల కోసం పోరాడుతా
ప్రజలను ఏమార్చి గెలిచి.. మోసం చేశారు
బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ నిప్పులు

**ఇకపై బయటకు వస్తా.. పోరాడతా**

"పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 80-90శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరఫున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే బీఆర్ ఎస్ పై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?" అని కేసీఆర్ ప్రశ్నించారు.

**హనుమకొండ, మహా :** తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను.

మిగతా 2లో

## కేసీఆర్ మనసంతా విషమే
### కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరించడానికే ప్రసంగం
తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా? .. మేం ఇబ్బంది పెడితే సభ జరిగేదా?
కేసీఆర్ ను నమ్మి అధికారమిస్తే పదేళ్లు కుళ్లబొడిచింది ప్రజలు చూడలేదా?
పడగొడితే పడిపోవడానికి ఇది బొమ్మరిల్లు కాదు మాజీ సీఎం
సభ ఫెయిల్ అయినందుకే ఫ్రస్టేషన్
కేసీఆర్ పై మండిపడ్డ మంత్రులు పొంగులేటి, సీతక్క. జూపల్లి, పొన్నం ఫైర్



**హైదరాబాద్:** కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మాజీ సీఎం ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు. మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. భారాస రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో భారాస అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగంపై మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించింది. రెండుసార్లు భారాసకు అధికారం ఇస్తే.. ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవలం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు.

మిగతా 3లో



## ఇక మీరు ఫార్మ్ హౌస్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోండి
### కేసీఆర్ వ్యాఖ్యలపై రాజాసింగ్ స్పందన
మంచి ప్రెసిడెంట్ వస్తే మాదే అధికారం

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

మిగతా 3లో

## ఏడాదిలో 31 శాతం పెరిగిన బంగారం ధర
పదేళ్ళలో 218% పెరుగుదల

వివరాలు 3లో

## భారత్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్
### తెలంగాణ గొప్పతనాన్ని చాటిన వేదిక
టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని రెండు రోజులపాటు నిర్వహించిన భారత్ సమ్మిట్ -2025 గ్రాండ్ సక్సెస్ అయ్యిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తెలిపారు. తెలంగాణ గొప్పతనాన్ని చాటేలా భారత్ సమ్మిట్ కొనసాగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారత్ సమ్మిట్ ను నిర్వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రపంచానికి తెలియజేయడానికి భారత్ సమ్మిట్ ఓ వేదికగా ఉపయోగపడిందన్నారు.


మిగతా 2లో



## మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరిపేలా చొరవ చూపండి
### సీఎంను కోరిన శాంతి చర్చల కమిటీ
మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని హామీ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో శాంతి చర్చల కమిటీ నేతలు సమావేశం అయ్యారు. మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని రేవంత్ రెడ్డికి వినతీపత్రం అందజేశారు. సీఎంతో భేటీ అయినవారిలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, దుర్గా ప్రసాద్, రవిచందర్, జంపన్న ఉన్నారు.

మిగతా 2లో



## బిగ్ ఎస్కేప్?
### కర్రెగుట్టల్లో భారీ సొరంగం
ఖంగుతిన్న భద్రతా బలగాలు

వివరాలు 3లో

## తెలంగాణ నూతన సీఎస్.. రామకృష్ణారావు
### సీనియారిటీకే పట్టం.. ఆర్థిక శాఖపై విశేష పట్టు
**30న రిటైర్ కానున్న శాంతికుమారి**
భారీగా ఐఎఎస్ ల బదిలీలు.. 20మందికి స్థాన చలనం
దాన కిషోర్, స్మితా సభర్వాల్ కు షాక్.. మళ్ళీ ఫైనాన్స్ కమిషన్ కు స్మిత
జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఆర్వీ కర్ణన్..
హరీష్ కు ప్రమోషన్.. జెన్ కో సీఎండిగా నియామకం.. ఐఅండ్ పిఆర్ అదనపు బాధ్యతలు
నవీన్ మిట్టల్ ను కదిలించని ప్రభుత్వం.. త్వరలో మరిన్ని బదిలీలు

### ప్రక్షాళనను ముందే చెప్పిన మహా



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం పాలనలో ప్రక్షాళన ప్రారంభించింది. భారీమార్పులు జరగబోతున్నాయంటూ మహా పత్రిక ముందుగానే ఏఏ అధికారులు బదిలీ కాబోతున్నారో చెప్పిన విషయం విదితమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కసరత్తు చూసి పాలనలో తనదైన మార్కు చూపేలా భారీ బదిలీల ప్రక్రియ చేపట్టారు. తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కే.రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖలో గత దశాబ్ధకాలంగా పనిచేస్తున్న ఆయన సేవలను ముమ్మందు ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నత స్థాయి పదవికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపిక చేశారు. కే.రామకృష్ణారావు (1991 ఐఏఎస్ బ్యాచ్) ప్రస్తుతం ఆర్థిక శాఖ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మిగతా 2లో






# తెలంగాణకు విలన్ నెంబర్ వన్ కాంగ్రెస్సే

(మొదటిపేజీ తరువాయి)
కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించ వద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం. సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

**ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం**

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

**ఉచిత బస్సులు పెట్టి జుట్లు పట్టి కొట్టుకునే స్థితి తెచ్చారు?**

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు. ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి'' అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**డైరీల్లో రాసుకోండి**

''ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్ సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 2030శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

**ఆపరేషన్ కగార్ ఆపేయాలి**

భాజపా వైఖరి అంతా భభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి డిల్లీకి పంపుదాం'' అని కేసీఆర్ అన్నారు.

## తెలంగాణ నూతన సీఎస్.. రామకృష్ణారావు

### సీనియారిటీకే పట్టం.. ఆర్థిక శాఖపై విశేష పట్టు

### 30న రిటైర్ కానున్న శాంతికుమారి

భారీగా ఐఎఎస్ ల బదిలీలు.. 20మందికి స్థాన చలనం

దాన కిషోర్, స్మితా సభర్వాల్ కు షాక్.. మళ్ళీ ఫైనాన్స్ కమిషన్ కు స్మిత

జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఆర్వీ కర్ణన్..

హరీష్ కు ప్రమోషన్.. జెన్ కో సీఎండిగా నియామకం.. ఐఅండ్ పిఆర్ అదనపు బాధ్యతలు

నవీన్ మిట్టల్ ను కదిలించని ప్రభుత్వం.. త్వరలో మరిన్ని బదిలీలు

ప్రక్షాళనను ముందే చెప్పిన మహా

(మొదటిపేజీ తరువాయి)
గత మూడు నెలలుగా కాబోయే ప్రధాన కార్యదర్శి అంటూ ప్రచారం జరుగుతున్నది. ఈ పదవి కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్ లు తమ స్థాయిలో పోటీ పడ్డారు. కొద్ది రోజుల క్రితం ఓబీసీ కులానికి చెందిన జయేష్ రంజన్ ప్రధాన కార్యదర్శి అవుతున్నారని వార్తలొచ్చాయి. ఉత్తర, దక్షిణ భారత వాదం తెరమీదికి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కే.రామకృష్ణారావు వైపు మొగ్గు చూపారనే స్పష్టమవుతున్నది. దీనికి తోడు తెలంగాణ వచ్చిన నాటి నుండీ ఆర్థికశాఖ బాధ్యతలు చూస్తున్న రామకృష్ణారావును నాలుగుమాసాల తర్వాత రిటైరైనా ప్రభుత్వ సేవల్లో వినియోగించుకునే ఉద్దేశ్యంతో ఎంపికచేసినట్లు భావిస్తున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున రామకృష్ణారావు నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. 2014 నుంచి ఆర్థికశాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్న రామకృష్ణారావు.. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నుంచి నిధులు రాబట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా రామకృష్ణారావును సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





**ఒకేసారి 20మంది బదిలీ**

ఒకేసారి 20మంది ఐఎఎస్ లను ప్రభుత్వం బదిలీచేసింది. కీలక శాఖల అధికారులకు స్థాన చలనం కలిగించింది. తె ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంత కాలంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్న స్మితాసభర్వాల్ కు పర్యాటక శాఖ తప్పించి మళ్ళీ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా నియమించారు. అప్రధాన్య పోస్టుకు ఆమెను బదిలీచేసి, పర్యాటక యువజన సర్వీసుల బాధ్యతలు జయేష్ రంజన్ కు అప్పగించారు. మిస్ వరల్డ్ పోటీల బాధ్యతలు ఇక జయేష్ రంజన్ ఆధ్వర్యంలో జరిగే అవకాశముంది. గత కొంతకాలంగా ఐ అండ్ పిఆర్ బాధ్యతలు చేస్తున్న హరీష్‌ను జెన్ కో సీఎండిగా నియమించారు. జీహెచ్ఎంసి కమిషనర్ తో పాటు దానకిషోర్, జయేష్‌రంజన్ శాఖల్లో పలు మార్పులు చేశారు.

| ఐఎఎస్ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ |
|---|---|---|
| డాక్టర్ శశాంక | డిజి, డాక్టర్ ఎంసిఆర్ హెచ్ ఆర్ డి | వైస్ ఛైర్మన్, సిజిజి, కమిషనర్ ఎఫ్ సిడిఏ |
| జయేశ్ రంజన్ | ఐటీ, పరిశ్రమలు | సీఈవో, పరిశ్రమలు,పెట్టుబడులు, వాణిజ్యం, యూత్, పర్యాటకం |
| స్మితా సభర్వాల్ | యువజనసర్వీసులు, పర్యాటకం | మెంబర్ సెక్రటరీ, ఫైనాన్స్ కమిషన్ |
| దానకిశోర్ | మునిసిపల్, పట్టణాభివృద్ధిశాఖ | కార్మికశాఖ, గవర్నర్ కార్యదర్శి |
| టీకే శ్రీదేవి | కమిషనర్, మునిసిపల్, సెక్రటరీ, పట్టణాభివృద్ధిశాఖ | మునిసిపల్, పట్టణాభివృద్ధిశాఖ (హెచ్ ఎండిఏ బయట) |
| ఇలంబర్తి | జీహెచ్ఎంసీ కమిషనర్ | పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి( హెచ్ఎండీఏ పరిధి) |
| ఆర్వీ కర్ణన్ | డైరెక్టర్, హెల్త్ | జీహెచ్ఎంసీ కమిషనర్ |
| ఎస్ హరీష్ | కమిషనర్ ఐ అండ్ పిఆర్ | జెన్ కో సీఎండి, ఎఫ్ఏసీ ఐ అండ్ పిఆర్, జాయింట్ సెక్రటరీ రెవెన్యూ |
| నిఖిల | సిఈవో, టీజీ ఐఆర్ డి | సీఈవో, సెక్రటరీ మానవ హక్కుల కమిషన్ |
| సంగీత సత్యనారాయణ | జాయింట్ సెక్రటరీ టు సీఎం | డైరెక్టర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ |
| ఎస్. వెంకటరావు | జాయింట్ సెక్రటరీ టు ప్రోటోకాల్ | యాదగిరి గుట్ట ఈవో, ఎండోమెంట్ డైరెక్టర్ |
| ఈవి నర్సింహారెడ్డి | డైరెక్టర్, పాఠశాల విద్య | మూసీ రివర్ ఫ్రంట్ ఎండి, అడిషనల్ సీఈవో పరిశ్రమలు, పెట్టుబడులు |
| బొక్కడే హేమంత్ | ఎండి, టీజీఎంఎస్ఐడిసి | జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ |
| జి.ఫణీంద్రరెడ్డి | సిఆర్వో, హైదరాబాద్ | ఎండి, టీజీఎంఎస్ఐడిసి |
| పి. కదిరవన్ | అడిషనల్ కలెక్టర్, హైదరాబాద్ | జాయింట్ కమిషనర్, పిఆర్ అండ్ ఆర్ డి |
| కె.విద్యాసాగర్ | ఓఎస్డీ టు సీఎస్ | అడిషనల్ కలెక్టర్ (స్థానికసంస్థలు), హైదరాబాద్ |
| ఆర్. ఉపేందర్ రెడ్డి | నాన్ కేడర్ | సెక్రటరీ, హెచ్ ఎండిఏ |

## ఈ వందల కోట్ల ధన ప్రవాహం ఎక్కడిది?

### కళ్లు బైర్లు కమ్మే ఈ సభ ఏర్పాట్ల సొమ్ము ఎక్కడిది?

కూలిన కాళేశ్వరందా? ధరణి దోపిడీ సొమ్మా?

బిల్డర్ల దగ్గర దోచిన అదనపు ఫ్లోర్ల సొమ్మా?

బీఆర్ఎస్ పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నల వర్షం



**హైదరాబాద్, మహా:** మంచినీళ్ళలా డబ్బు ఖర్చుపెడుతూ, ఊహకందనంత ధన ప్రవాహం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఈ వందల కోట్ల సొమ్ము ఎక్కడిదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఒక రాజకీయ పార్టీ ఒక మాదిరి సభ పెట్టాలంటే ఖర్చులు భరించలేక నాయకుల నరాలు తెగుతాయని, ప్రతిపక్షంలో ఉండి బీఆర్ఎస్ వందలకోట్ల ఖర్చుతో వరంగల్ సభ నిర్వహణ చూస్తుంటే కళ్లు చెదరడంతో పాటు తెలంగాణను ఎంత మేర దోచుకున్నారో ఈ సభ స్పష్టం చేస్తున్నదని అన్నారు. సభా వేదిక, హంగామా, ఆర్భాటాలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఈ సొమ్ముకు లెక్కలు చెప్పాలన్నారు. ఈ డబ్బు కూలిన కాళేశ్వరం కమీషన్ సొమ్మా...!? మిషన్ భగీరథ పేరుతో పాత ట్యాంకులకు రంగులు వేసి... పాత తాగునీటి పథకాలను లింక్ చేసి దోచిన సొమ్మా? హైదరాబాద్ బిల్డర్ల దగ్గర పర్మిషన్ల కోసం వసూలు చేసిన "అదనపు ఫ్లోర్ల" కమీషన్ సొమ్మా? ఫార్ములా కార్ రేస్ పేరుతో ప్రైవేట్ కంపెనీలకు దోచిన సొమ్మా? ధరణి పేరుతో అర్ధరాత్రులు భూ హక్కులను మార్చేసి దోచిన వేల ఎకరాల దోపిడీ సొమ్మా? ఖానామెట్, నియోపోలీస్, కోకాపేట్ లలో వేల కోట్ల విలువ చేసే భూములను వేలం పేరుతో ఐనవారికి దోచిపెట్టడం ద్వారా సంపాదించిన సొమ్మా? లక్షల కోట్ల విలువ చేసే ఔటర్ రింగ్ రోడ్డును కేవలం రూ.7వేల కోట్లకు 33 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి ధారాదత్తం చేయడం వల్ల వచ్చిన "కిక్ బ్యాక్" సొమ్మా!? అని ఎంపీ కిరణ్ ప్రశ్నించారు. రెండు గంటల సభ కోసం ఖర్చు చేస్తోన్న ఈ వందల కోట్ల ధన ప్రవాహం ...ఏ కమీషన్ల తాలుఖాదో తెలంగాణ సమాజానికి బీఆర్ఎస్ చెప్పాలన్నారు.

## ఈడి అధికారులకు మహేష్ బాబు ట్విస్ట్

### ఇపుడు రాలేను.. మరో డేట్ ఇవ్వండంటూ మెయిల్

### షూటింగ్ ఉన్నందున రాలేనంటూ వివరణ





**హైదరాబాద్, మహా:** ఈడి అధికారులకు సూపర్ స్టార్ మహేష్ బాబు ట్విస్ట్ ఇచ్చారు. షూటింగ్ కారణంగా తాను రాలేనని, మరో తేదీ ఇవ్వాలని కోరారు. సాయి సూర్య, సురానా కేసుకు సంబంధించి ఈడీ అధికారులు సూపర్ స్టార్ మహేష్ బాబుకు నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఈ నెల 28వ తేదీన ఈడీ ఎదుట హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. ఆ నోటీసుల ప్రకారం మహేష్ బాబు రేపు ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మహేష్ బాబు ఈడీ అధికారులకు ఓ విజ్ఞప్తి చేశారు. సినిమా షూటింగ్ కారణంగా తాను సోమవారం విచారణకు హాజరు కాలేనని స్పష్టం చేశారు. మరో తేదీ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఈడీ అధికారులకు ఓ మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈడీ అధికారులు మహేష్ బాబు విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని సమయం ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

### ఇంతకీ ఏంటీ కేసు..

వివిధ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన కేసులో రియల్ఎస్టేట్ సంస్థ సురానా గ్రూప్, దాని అనుబంధ సంస్థలు సాయిసూర్య డెవలపర్స్, ఆర్యవన్ ఎనర్జీలపై చెన్నైవిభాగం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహించారు. సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తో పాటు ఇండస్ట్రీస్ ఎండీ నరేంద్ర ఇంట్లో కూడా సోదాలు చేశారు. భారీగా నగదు .. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సురానా గ్రూపు పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. సురానా అనుబంధ కంపెనీ సాయి సూర్య డెవలపర్స్ సతీష్ ఇంట్లో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు.

### యాడ్స్ విషయంలో మహేష్‌కు నోటీసులు

ప్రమోషన్స్ కింద సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్, సాయి సూర్య డెవలపర్స్ కంపెనీల నుండి మహేష్ బాబు పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ. 3.4 కోట్ల నగదు, రూ. 2.5 కోట్లు ఆర్‌టీజీఎస్ ద్వారా.. మొత్తం రూ. 5.9 కోట్లు తీసుకున్నారని ఈడీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మహేష్‌కు ఈడీ అధికారులు నోటీసులు పంపారు. ఏప్రిల్ 28వ తేదీన విచారణకు రావాలని ఆదేశించారు.



## బిగ్ ఎస్కేప్?

### కర్రెగుట్టల్లో భారీ సొరంగం

### ఖంగుతిన్న భద్రతా బలగాలు

**మహా :** ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో ఆరోరోజూ భద్రతా దళాల కూంబింగ్ కొనసాగింది. మావోయిస్టుల కోసం అడవుల్లో ముమ్మరంగా గాలింపు కొనసాగిస్తున్నారు. కర్రెగుట్టలను అన్నివైపుల నుంచి చుట్టుముట్టారు. ఈక్రమంలో భద్రతా బలగాలు భారీ సొరంగాన్ని గుర్తించాయి. వెయ్యి మంది తలదాచుకునేందుకు వీలుగా దీని నిర్మాణం ఉంది. లోపల పెద్ద మైదానంతో విశాలంగా ఉన్న సొరంగాన్ని గుర్తించారు. ఇందులో నీటి వసతి, ఇతర సౌకర్యాలున్నట్లు సమాచారం. కొన్ని నెలల పాటు మావోయిస్టులు ఈ సొరంగంలోనే ఉన్నట్లు భద్రతా బలగాలు గుర్తించారు. ఇక్కడి నుండి మావోలు ఎస్కేప్ అయి ఉంటారని భావిస్తున్నారు. అయితే కొండల్లో పెద్ద సంఖ్యలో ఉన్న మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వారి పరిస్థితి విషమంగా మారుతోందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు నిరంతరం జరుగుతున్న ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ఇప్పుడు ఆహారం కోసం ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని చెబుతున్నారు. మావోయిస్టులు ప్రస్తుతం దాక్కున్న అన్ని కొండలను చుట్టుముట్టే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని ప్రభుత్వం, భద్రతా బలగాలు భావిస్తున్నాయి. హిడ్మా దలంతో పాటు దళాలన్నీ మూకుమ్మడిగా ఒక్కచోటికి చేరినట్లు భావించిన భద్రతా బలగాలు దాడికి దిగినా.. సొరంగం చూసి ఒక్కసారిగా షాక్ అయినట్లు తెలిసింది.

## భారత్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్

### తెలంగాణ గొప్పతనాన్ని చాటిన వేదిక

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



(మొదటిపేజీ తరువాయి)
భారత్ సమ్మిట్ కు 100 దేశాలకు పైబడిన ప్రభుత్వ అధినేతలు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలతో కలిపి మొత్తంగా 450 మంది ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ అనుభవాలను పంచుకోవడం జరిగిందని చెప్పారు. ప్రపంచ శాంతి, ప్రపంచ న్యాయం, వాతావరణం మార్పులు, టెర్రరిజం అంశాలపై లోతైన చర్చలు జరిగాయన్నారు. రాహుల్ గాంధీ పాద యాత్రలో తెలుసుకున్న ప్రజల సాధక బాధలను క్లుప్తంగా చెప్పారు అని తెలిపారు. అన్యాయం ఎదుర్కొని కొత్త శకాన్ని సృష్టించి శ్రామికుల హక్కులను కాపాడాలని తీర్మానించారని పేర్కొన్నారు. ప్రగతీ శీల ఉద్యమాల అణిచివేతను ఖండించారని తెలిపారు. మీడియా పై దాడులను రాహుల్ గాంధీ ఖండించారన్నారు. సమ్మిట్ వేదికగా లోక్సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ప్రగతిశీల పార్టీల చెందిన ప్రతినిధులు.. ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ డిక్లరేషన్ ను ప్రవేశ పెట్టారన్నారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు అయినా అహింసా సత్యం న్యాయం ప్రజాస్వామ్యం వంటి అంశాలపై సమ్మిట్ లో చర్చించడ జరిగిందన్నారు.

## మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరిపేలా చొరవ చూపండి



(మొదటిపేజీ తరువాయి)
నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉందని సీఎం వారికి తెలిపారు. ఈ అంశంపై జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకుంటామని మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే కేంద్రం మావోయిస్టులను ఏరివేస్తున్న సంగతి తెలిసిందే. మావోయిస్టుల స్థావరాలపై బలగాలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ప్రతి దాడిలో 20 నుండి 30 మంది మావోయిస్టులు చనిపోతున్నారు. ఈ క్రమంలో శాంతి చర్చలు జరపాలని దాడులు చేయవద్దని పలువురు మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

# కేసీఆర్ మనసంతా విషమే

(మొదటి పేజీ తరువాయి)
అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత భారాస ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టింది. సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు. మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. భారాస సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు. సభకు అసలు ఆటంకం సృష్టించలేదు.. మేం ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా? ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం. గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామని కేసీఆర్ ఆరోపించారు. అసలు యూనివర్సిటీ ఆస్తులను మేం ఎక్కడ విక్రయించాము? ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తోంది. కేసీఆర్ తెచ్చిన ధరణిలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అందరికీ తెలుసు. 'ధరణి' గురించి కేసీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. ఈ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం గురించి ఎందుకు మాట్లాడలేదు? కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలో 8వ అద్భుతం అని చెప్పుకొన్నారు. కానీ, ఇవాళ ఆ ప్రాజెక్టు పనికిరాదని జాతీయ డ్యామ్ సేఫ్టీ కమిటీ నివేదిక ఇచ్చింది. ఏ అంశంపై ఎప్పుడు అసెంబ్లీ పెట్టమంటారో కేసీఆర్ చెప్పాలి. కేసీఆర్ చెప్పిన అంశంపై అసెంబ్లీ చర్చకు మేం సిద్ధం. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ నేతకు ఇవ్వాలి. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ఉద్యమం రోజుల్లో చెప్పారు. అది ఎలాగూ చేయలేదు.. కనీసం ప్రతిపక్ష నేత హోదాను అయినా దళితుడికి ఇవ్వొచ్చు కదా..! కేసీఆర్ పగటి కలలను తెలంగాణ ప్రజలు నిజం కానివ్వరు. ఆయన పడగొడితే పడిపోవడానికి ఇది బొమ్మరిల్లు కాదు. మళ్లీ సీఎం అవుతానని భ్రమపడుతూ.. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు'' అని పొంగులేటి అన్నారు.

**అధికారం పోయిందనే అక్కసు : సీతక్క**

అధికారం పోయిందనే అక్కసును మాజీ సీఎం కేసీఆర్ వెళ్లగక్కారని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారం పోయిన తర్వాత ఆయన కుటుంబంలో చీలికలు వస్తున్నాయని బాధపడుతున్నారు తప్ప.. ప్రజల కోసం కాదని అన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పార్టీ రజతోత్సవ వేళ ఎవరైనా పార్టీ త్యాగాలు, గొప్పదనాలు చెప్పుకొంటారు. కానీ, కేసీఆర్ మాత్రం కాంగ్రెస్‌ను విమర్శించేందుకే సభ పెట్టారు. పేద మహిళల కోసం ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తే.. వారిని అవమానిస్తున్నారు. కేసీఆర్ అంతదారుణంగా పోలీసు వ్యవస్థను ఇంకెవరూ వాడుకోలేదు. అధికారంలో ఉన్నన్ని రోజులూ పోలీసులను తన ఫామ్‌హౌజ్ వద్ద కాపలా ఉంచారు. ప్రజలు నిరసన తెలిపే అవకాశం లేకుండా ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ మూసివేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెరిపించిన ధర్నాచౌక్ వద్ద ఆయన కుమార్తె ధర్నాలు చేస్తున్నారు. అసెంబ్లీలో మాట్లాడే సమస్యలను ఉత్తికబుర్లని అవమానించారు. అలాంటి వ్యక్తికి మళ్లీ అసెంబ్లీలో అడుగు పెట్టే నైతిక హక్కు ఉందా?'' అని సీతక్క ప్రశ్నించారు.

**కేసీఆర్ గర్వం ఇంకా తగ్గలేదు : జూపల్లి**

ప్రజలు ఓడించి ప్రతిపక్షంలో కూర్చుబెట్టినా.. కేసీఆర్‌లో ఇంకా గర్వం తగ్గలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. పార్టీ రజతోత్సవ వేదికపై కేసీఆర్ మినహా ఒక్క నేత అయినా మాట్లాడకుండా నిరంకుశంగా వ్యవహరించారని అన్నారు. భారాస నేతలు నిజాయితీపరులైతే.. ఆ పార్టీ ఖాతాలో రూ.వేల కోట్లు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. '' కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఉద్యోగి దగ్గర ఇవాళ రూ.200 కోట్లు దొరికాయి. ఆయనే అంత సంపాదించారంటే.. కేసీఆర్ కుటుంబం ఇంకెంత దోచుకుందో అర్థం చేసుకోవాలి. కేసీఆర్ ఇంట్లో సోదాలు చేస్తే వేలకోట్లు దొరుకుతాయి. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి ఇచ్చారా?పదేళ్లు ప్రైవేటు వ్యక్తి చేతిలో ఉన్న కంచ గచ్చిబౌలి భూములను ఎందుకు పట్టించుకోలేదు. బంగారు బాతులాంటి ఔటర్ రింగ్‌రోడ్డును 30 ఏళ్లకు అప్పనంగా అమ్మలేదా? ఏ తప్పూ చేయకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు విదేశాల్లో ఎందుకు దాక్కున్నారు?'' అని జూపల్లి ప్రశ్నించారు.

**కేసీఆర్ సభ అట్టర్ ఫ్లాప్ : పొన్నం ప్రభాకర్**

కేసీఆర్ అవకాశవాదిలా మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. '' సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అనలేదా?ఇవాళ విలన్ అంటున్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారికి ఆ సభా వేదికపై ఎందుకు నివాళి అర్పించలేదు. పార్టీ పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎవరికైనా ఇచ్చారా'' అని నిలదీశారు. కేసీఆర్ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, అనుకున్న రేంజ్‌లో జనాలు రాకపోయేసరికి ఆ అక్కసును కాంగ్రెస్‌పై కక్కారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విలన్ అనే మాటల్ని వెనక్కి తీసుకోవాలన్నారు. స్పీచ్ మధ్యలో మాటిమాటికి కేసీఆర్ అసహనం వ్యక్తం చేసారని, కింది నుండి సీఎం సీఎం అంటున్నారు కానీ ఎవర్ని అంటున్నారో తెలియదన్నారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీలో గౌరవమే లేదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా సోనియా గాంధీ చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకాలు చేయాలని మంత్రి పొన్నం పిలుపు నిచ్చారు. సోనియా గాంధీ లేకపోతే కేసీఆర్ మూడు చెరువుల నీళ్లు తాగినా తెలంగాణ రాకపోయేదన్నారు.





## సీఎం రేవంత్‌రెడ్డి తో మహిళా, బాలల హక్కుల కమిషన్ సభ్యులు భేటీ

(మొదటి పేజీ తరువాయి)
తొలుత ప్రజాభవన్ లో మంత్రి సీతక్కను బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సీతక్కకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో బాలల హక్కుల కమిషన్ సభ్యులు సత్కరించారు. ఇటీవల బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్, సభ్యులను ప్రభుత్వం నియమించింది. మంత్రి సీతక్కతో తొలిసారి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బాలల హక్కుల కమిషన్ సభ్యులను మంత్రి సీతక్క అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు లు పాల్గొన్నారు.



## ఏడాదిలో 31 శాతం పెరిగిన బంగారం ధర

**పదేళ్ళలో 218 శాతం పెరుగుదల**

**మహా:** బంగారం ధర పెరుగుతూనే ఉంది. గత 10 సంవత్సరాలలో దీని ధర దాదాపు 218 శాతం పెరిగింది. 2014 సంవత్సరంలో అక్షయ తృతీయ నాడు 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 30,000 మాత్రమే ఉండగా, 2024 నాటికి ఇది 218 శాతం పెరిగింది. ప్రస్తుతం అంటే 2025లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు దాదాపు రూ. 95,900పైగా చేరుకుని లక్ష రూపాయలకు చేరుకుంది. ఇది 2014లో అక్షయ తృతీయ నాడు రూ. 30,182గా ఉంది. అయితే, కొన్ని రోజుల క్రితం బంగారం 10 గ్రాములకు రూ. లక్ష దాటింది. ది ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. 2025 సంవత్సరంలోనే బంగారం ధర 31 శాతం పెరిగింది. 2015లో బంగారం 11 శాతం ప్రతికూల రాబడిని ఇచ్చింది. అలాగే 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ .26,936గా ఉంది. అయితే 2016 సంవత్సరంలో బంగారం 11 శాతం సానుకూల రాబడిని ఇచ్చింది. అలాగే ధర 10 గ్రాములకు రూ.29,805కి పెరిగింది. అయితే, 2017 సంవత్సరంలో బంగారం మళ్ళీ 3 శాతం ప్రతికూల రాబడిని ఇచ్చింది. అలాగే ధర 10 గ్రాములకు రూ. 28,873 వద్ద ఉంది. 2018లో బంగారం 9 శాతం రాబడిని ఇచ్చింది. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 31,534. కాగా, 2019లో బంగారం 1 శాతం రాబడిని ఇచ్చింది ధర 10 గ్రాములకు రూ. 31,729 ఉంది.

## జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి తెలంగాణ పర్యటన

**హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలతో మర్యాద పూర్వక భేటీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 27:మహా:** జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీమతి శిల్పి నేహా తెర్కే ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర రావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధి, సమగ్ర సాగు విధానాలు, పంట విభజన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అనేక అంశాలపై చర్చ జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ రంగంలో అనుభవాలను పంచుకోవాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు నిర్ణయించారు. శిల్పి నేహా తెర్కే గారు ఈ నెల 30వ తేదీ వరకు తెలంగాణలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నేషనల్ మిలెట్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ , ఫిష్ ఫార్మింగ్ కేంద్రం, నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలెట్స్ రీసెర్చ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను సందర్శించనున్నారు. ఈ సంస్థలచే చేపడుతున్న పరిశోధనలపై అవగాహన సాధించనున్న ఆమె, ఆయా రంగాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను తమ రాష్ట్రంలో కూడా అందుబాటులోకి తేనున్న దిశగా చర్చలు జరపనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు ఐఏఎస్ , ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ పాషా ఐఏఎస్ తదితర అధికారులు కూడా పాల్గొన్నారు. విభిన్న శాఖల అధికారులు తమ అనుభవాలను షేర్ చేస్తూ, వ్యవసాయ రంగ బలోపేతానికి అవసరమైన అంశాలను వివరించారు. ఈ పర్యటన ద్వారా జార్ఖండ్-తెలంగాణ వ్యవసాయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని, రాష్ట్రాల అభివృద్ధికి ఇది సహాయపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## రేవంత్ పేరు పలకని కేసీఆర్.. కారణం అదే?

**హైదరాబాద్, మహా:** వరంగల్ రజతోత్సవ సభలో తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ పై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు చెరిగారు. ఒక్క పథకాన్ని కూడా సరిగ్గా అమలు చేయలేకపోతున్నారని ఫైర్ అయ్యారు. పదేళ్లుగా తాము అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన తెలంగాణను ఆగం చేశారని ధ్వజమెత్తారు. రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు ఇస్తామని చెప్పి అన్నదాతలను మోసం చేశారన్నారు. 24 గంటల కరెంట్ ను ఆగం పట్టించారన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో భూముల ధరలు బాగా పెరిగాయని.. ఇప్పుడు కొనే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి కాంగ్రెస్ సర్కార్ అసమర్థతే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేసీఆర్.. తన ప్రసంగంలో ఎక్కడా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతల పేర్లను ప్రస్తావించకపోవడం గమనార్హం. అయితే.. కేసీఆర్ వ్యూహాత్మకంగానే ఏ ఒక్క కాంగ్రెస్ నేత పేరు కూడా ప్రస్తావించలేదన్న చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.

## రక్తం మరుగుతోంది

**మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ**

భారతీయులకు ప్రపంచం అండగా నిలుస్తోంది.. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)
ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ యుద్ధంలో దేశ ఐక్యత, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావం మనకు అతిపెద్ద బలం అని ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన భయంకరమైన దాడిని మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన మోదీ. బాధిత కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడికి ప్రగాఢ సానుభూతి ఉందని ఆయన అన్నారు. చనిపోయిన వారు ఏ రాష్ట్రానికి చెందిన వాడైనా, ఏ భాష మాట్లాడినా, ఈ దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధను అంతా అనుభవిస్తున్నారన్నారు.

**శాంతి..ప్రగతిని సహించలేక దాడి**

"కాశ్మీర్‌లో గత కొన్నేళ్ళ నుంచి పాఠశాలలు, కళాశాలు కళకళలాడుతున్నాయి. ప్రజాస్వామ్యం బలపడుతోంది. పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ప్రజల ఆదాయం పెరుగుతోంది. యువతకు కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయి. ప్రజాస్వామ్యం బలపడుతోంది. తిరిగి శాంతియుత వాతావరణం కనిపించడంతో దేశ శత్రువులు, జమ్మూ కాశ్మీర్ శత్రువులు ఓర్వలేకపోయారు. మళ్లీ నాశనం చేయాలని పెద్ద కుట్రను అమలు చేశారు. ఈ ఉగ్రదాడి తర్వాత దేశం మొత్తం ఒకే గొంతులో మాట్లాడుతుంది అని ప్రధాని అన్నారు. భారతదేశం ప్రజల్లో ఉన్న కోపం ప్రపంచవ్యాప్తంగా ఉంది. ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ పోరులో దేశ ఐక్యత, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావమే అతిపెద్ద బలం. ఈ ఐక్యతే ఆధారం. దేశం ఈ సవాలును ఎదుర్కోవడానికి



సంకల్పాన్ని బలోపేతం చేసుకోవాలి. ఒక్కటిగా మారి ప్రదర్శించాలన్నారు.

**బాధితులకు న్యాయం చేస్తాం**

ఈ ఉగ్రవాద దాడి తరువాత, ప్రపంచం నలుమూలల నుండి సంతాప సందేశాలు నిరంతరం వస్తున్నాయి. ప్రపంచ నాయకులు కూడా నాకు ఫోన్ చేశారు, లేఖలు రాశారు. ఈ హేయమైన ఉగ్రవాద దాడిని అందరూ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులకు ప్రపంచం అండగా నిలుస్తోంది. బాధిత కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని మరోసారి హామీ ఇస్తున్నానని ప్రధానమంత్రి అన్నారు. ఈ దాడికి పాల్పడిన నిందితులకు, కుట్రదారులకు కఠినంగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా, ధృడంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## సర్జికల్ స్ట్రైక్స్ వద్దు.. పీవోకేను స్వాధీనం చేసుకోండి

**టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ**

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ, సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక ఎలాంటి సర్జికల్ స్ట్రైక్స్ వద్దని అన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. 26 మందిని బలిగొన్న పహల్గామ్ ఉగ్రదాడిపై అభిషేక్ బెనర్జీ ఆదివారం స్పందించారు. 'పాకిస్థాన్‌కు మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ లేదా సింబాలిక్ బెదిరింపులకు సమయం కాదు. వారు అర్థం చేసుకునే భాషలో వారికి గుణపాఠం చెప్పాల్సిన సమయం ఇది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను తిరిగి పొందే సమయం వచ్చింది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఇక మీరు ఫార్మ్ హౌస్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోండి

కేసీఆర్ వ్యాఖ్యలపై రాజాసింగ్ స్పందన.. మంచి ప్రెసిడెంట్ వస్తే మాదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)
బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ చేసిన విమర్శలను రాజా సింగ్ తప్పుబట్టారు. కేసీఆర్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన కొట్టిపారేశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీని దేవుడంటూ ఆకాశానికెత్తిన కేసీఆర్, ఇప్పుడు నిధుల విషయంలో విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని రాజా సింగ్ అన్నారు. "అప్పుడు మోదీ దేవుడు.. మరి నిధులు ఎందుకు అడగలేదు? భయపడ్డారా?" అంటూ ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీలో తాను నిధుల గురించి ప్రశ్నించినప్పుడు కూడా కేసీఆర్ తప్పుడు సమాధానాలు ఇచ్చారని రాజా సింగ్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పది లక్షల కోట్ల రూపాయల నిధులు అందించిందని రాజా సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అందించిన చేయూతే కారణమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, 'అప్పుల తెలంగాణ'గా, 'మత్తు తెలంగాణ'గా మార్చారని తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో యువత పెద్ద ఎత్తున మద్యానికి బానిసలు కావడానికి కేసీఆర్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన దుయ్యబట్టారు. ప్రజలు కూడా కేసీఆర్ పాలనను చూశారని, డబుల్ ఇంజన్ సర్కార్ (కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం) వస్తేనే తెలంగాణ నిజమైన



అభివృద్ధి సాధిస్తుందని విశ్వసిస్తున్నారని రాజా సింగ్ అభిప్రాయపడ్డారు. అయితే, గత ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాకపోవడానికి తమ పార్టీలోని కొందరు నేతల వైఖరే కారణమని పరోక్షంగా వ్యాఖ్యానించారు. త్వరలోనే పార్టీకి కొత్త అధ్యక్షుడు వస్తారని, ఆయన నాయకత్వంలో ప్రజల్లోకి బలంగా వెళతామని ధీమా వ్యక్తం చేశారు. ఇకపై బీఆర్ఎస్ అధికారంలోకి రావడం అనేది కేసీఆర్ మరిచిపోవాలని రాజా సింగ్ అన్నారు. "మీ ప్రభుత్వం మళ్లీ వస్తుందనే భ్రమ వీడండి. మీరు ఫార్మ్ హౌస్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోండి" అంటూ కేసీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఢిల్లీలో బాలయ్య, తారక్

ప్రధాని సమక్షంలో: అరుదైన సన్నివేశం

పద్మ వేడుకకు నందమూరి, నారా ఫ్యామిలీలు



**ఢిల్లీ, మహా:** ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణకు అరుదైన అవార్డు అందుకోనున్నారు. బాలకృష్ణకు కేంద్రం పద్మవిభూషన్ అవార్డు ప్రకటించింది. సోమవారం రాష్ట్రపతి భవన్ లో పలువురు ప్రముఖుల సమక్షంలో రాష్ట్రపతి పద్మ అవార్డులను ప్రధానం చేయనున్నారు. ఈ వేడుక కోసం నందమూరి నారా కుటుంబ సభ్యులు ఢిల్లీకి చేరుకుంటున్నారు. ఈ అవార్డు పురస్కారం వేళ వీరంతా ఒకే వేదిక మీదకు రావటం ఆకర్షణీయంగా మారుతోంది. రాష్ట్రపతి భవన్ లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. రేపు (సోమవారం )సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవ వేడుకకు ముహూర్తంగా నిర్ణయించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పద్మ అవార్డులను ప్రదానం చేయనున్నారు. నందమూరి బాలకృష్ణ పద్మవిభూషణ్ అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ దంపతులు సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొనేందుకు నందమూరి నారా కుటుంబ సభ్యులు ఢిల్లీకి చేరుకుంటున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సైతం ఢిల్లీకి వస్తున్నారు.

## పాకిస్థాన్ రత్న... సిద్ధరామయ్యపై బీజేపీ ఫైర్



**మహా:** పాకిస్థాన్‌తో యుద్ధం వద్దంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపాయి. తాను పాకిస్థాన్‌తో యుద్ధానికి అనుకూలం కాదంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక స్పందిస్తూ... సిద్ధరామయ్యను 'పాకిస్థాన్ రత్న'గా అభివర్ణించారు. "మీ అవివేకపు, అర్థరహిత వ్యాఖ్యలతో మీరు రాత్రికి రాత్రే పాకిస్థాన్‌లో ఫేమస్ అయిపోయారు" అని ఎద్దేవా చేశారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై సొంత పార్టీ నేతల నుంచి కూడా భిన్న స్వరాలు వినిపించాయి. కాంగ్రెస్ నేత హెచ్ఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ, "ఇది సిద్ధరామయ్య వ్యక్తిగత ప్రకటన, కాంగ్రెస్ పార్టీ వైఖరి కాదు. ఇలాంటి వ్యక్తిగత ప్రకటనలు చేయాలనుకుంటే, పార్టీకి, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి చేయవచ్చు. పాక్ కు వ్యతిరేకంగా దేశమంతా ఏకతాటిపై నిలవాలని రాహుల్ గాంధీ తదితరులు పిలుపునిచ్చారు. దాన్ని పాటించకుండా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం చాలా తప్పు" అని అన్నారు.

# నిర్బంధ కాలంలో కర్తవ్య బోధన చేసే కథలు

# చారల పిల్లి

**- రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి, 89853 04568**

దేశంలో మతవాదం రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రజాస్వామ్య శక్తులు ఈ మతం ఊబిలో చిక్కుకుంటున్న యువతను ఎలా బయటపడేయాలని ఆలోచిస్తున్నాయి. మేధావులు, ఆలోచనపరులు తమకు తోచిన పద్ధతుల్లో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజాన్ని చైతన్య పరుస్తున్నారు. యువత మరెప్పటికీ ఈ ఊబి నుంచి బయట పడకుండా నిత్యం అసహనంతో మగ్గిపోతూ ఒకరినొకరు దూషించుకుంటూ గడుపుతుంటే చాపకింద నీరులా ఎప్పటికీ తమ వద్దే పెత్తనం, పదవి ఉండేలా రాజకీయనాయకులు జాగ్రత్తపడుస్తున్నారు.




ఇలాంటి కాలంలో ఒక రచయిత ఏం చేయాలో వేంపల్లె షరీఫ్ అదే చేస్తున్నాడు. గతంలో ఇతను వెలువరించిన జుమ్మా, టోపీ జబ్బార్ కథాసంకలనాలే కాకుండా తాజాగా వెలువడ్డ చారలపిల్లి కూడా మతం కోరల్లో చిక్కుకున్న సమాజం, చికిత్స గురించి మాట్లాడుతుంది. రచయిత స్వయంగా మైనార్టీ వర్గానికి చెందిన వాడు కావడంతో ఇతర మతస్థులకు ఉన్నంత స్వేచ్ఛ ఇతని కలానికి ఉండదని చెప్పుకోవడానికి కొంత ఇబ్బందిగా ఉన్నా అదే నిజం కాబట్టి ఒప్పుకోకతప్పదు. తనకున్న పరిధిలోంచే షరీఫ్ సమాజాన్ని చూసే తీరు చదువరులను ఆశ్చర్యపరుస్తుంది. అందుకే కె. శ్రీనివాస్ వంటి విమర్శకుడే కథల్లో రచయిత ఎక్కడున్నాడో వెతుక్కోవాల్సి వచ్చిందని ముందుమాటలో చెప్పుకున్నాడు.

నిజానికి ఒక మంచి రచన యొక్క స్వభావం కూడా రచయితను మరిపించేలా చేయాలి. చాలా బుద్ధి పెట్టి ఆలోచిస్తే కానీ షరీఫ్ ఏం చెబుతున్నాడో కొన్ని కథల్లో అంతుబట్టదు. చాలా కథలు ప్రధాన స్రవంతి శైలిలో సాగినా ఒకట్రెండు కథలు ఇతని సహజ శైలికి భిన్నంగా కొనసాగి మనల్ని కాసేపు ఆలోచనల్లో పడేస్తాయి. ముఖ్యంగా టైటిల్ కథ "చారల పిల్లి' చాలా తెలివైన కథ. పిల్లి నియంకుశ రాజ్యానికి ప్రతీకైతే పావురాలు మైనార్టీలు లేదా శాంతికి ప్రతీకగా ఇందులో కనిపిస్తాయి. రోజురోజుకు పిల్లి చేతిలో బలైపోతున్న పావురాల తరపున మాట్లాడలేక మాట్లాడితే సమాజం ఏమంటుందో తెలీక సతమతమయ్యే పరిస్థితిలో ఈ కథలోని ప్రధాన పాత్ర అయిన పిల్లవాడు కనిపిస్తాడు. తల్లి పాత్రను భరతమాతకు ప్రతీకగా తీసుకుంటే కానీ షరీఫ్ ఇందులో ఏం చెప్పాడో పూర్తిగా అర్థం చేసుకోలేము.

అలాగే ముస్లిముల తీరుపై కూడా షరీఫ్ కి అసహనం ఉంది. పూర్తిగా ఫండమెంటలైజ్ అయిపోతున్న తన జాతిని చూసి బాధపడతాడు. వారు స్థానిక సంస్కృతీ సంప్రదాయాలను దూరం చేసుకోవడం ద్వారా ఈ మట్టి వాసన కోల్పోతారని తపన పడతాడు. "బాబయ్య స్వామి దర్గా'', "బడేపీర్'' వంటి కథల్లో షరీఫ్ ఈ కోణంలో స్పష్టంగా కనిపిస్తాడు. ఇప్పుడు వక్ఫ్ బోర్డు బిల్లు వ్యతిరేక నిరసనలు జరుగుతున్న సమయంలో ఈ కథలు చదివితే ముస్లిములకు దర్గాలు అక్కర్లేదు కానీ వాటి ఆస్తులు మాత్రం కావాలా.. అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఎంత లేదన్నా ఈ దేశ నేల



మీద ముఖ్యంగా దక్షిణాదిలో చెక్కుచెదరని మత సామరస్యానికి పునాదులు వేసింది మాత్రం సూఫీయిజం అనే చెప్పాలి. ఒకవైపు మెజార్టీ మతవాదం తరుముతుంటే మరోవైపు కనీసం మత సామరస్యానికి ప్రతీకైన సూఫీ వాదాన్ని కూడా నిలుపుకోకుండా సమాజంలో ఒంటరిగా మిగులుతున్న ముస్లిముల స్థితి మీద జాలి కలుగుతుంది. అందుకే ఓల్గా ఈ కథలు చదివితే కన్నీళ్లు వచ్చాయి అని ముందుమాటలో రాశారు.

మొత్తానికి షరీఫ్ మెత్తగానే తాను చెప్పాలనుకున్న అంశాలు చెప్పుకుపోయాడు. ఇంతటి నిర్బంధం ఉన్న సమకాలీనత నుంచి పారిపోకుండా ఏదో మేర తనకు చేతనైనంతలో గొంతు వినిపించడమనే అతని నిబద్ధత మీద గౌరవం కలుగుతుంది. ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ కథలను చదివి యువకులైన తమ పిల్లలతో కూడా చదివిస్తే ఎంతోకొంత మత పాఠాల ద్వారా పాడైన బుర్రలు మెరుగుతాయనడంలో సందేహం లేదు.

**చారలపిల్లి (కథలు),**
**- డా. వేంపల్లె షరీఫ్,**
**పేజీలు 160, ధర 190/-,**
**ప్రతులకు వాట్సప్ నెంబరు 9603429366.**

**రచనలకు ఆహ్వానం**
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

**పుస్తక సమీక్షల కోసం...**
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# సమీర్ తంతి అంతరంగ కథనం

**- వంశీకృష్ణ**
**95734 27422**

సమకాలీన అస్సామీ సాహిత్యం లో సమీర్ తంతి ది అనుకరించలేని సంతకం . ఇప్పటి వరకూ 12 కవిత్వ సంపుటాలు కొన్ని వందల వ్యాసాలు ఆఫ్రికన్ జాపనీస్ కవిత్వ అనువాదాలు, రెండు కథా సంపుటాలు అతడి ఖాతాలో వున్నాయి . 2012 లో అసోం వ్యాలీ లిటరరీ అవార్డు గెలుచుకున్నారు. 2019 లో కూడా తన కవిత్వం సాహిత్య అకాడమీ అవార్డు కోసం షార్ట్ లిస్ట్ అయింది. ఐదేళ్ల తరువాత అదే అవార్డు 2024 తనని వరించింది. దీర్ఘ చీకటి ఆకాశం లో నక్షత్రాలు నిద్రపోతున్నప్పుడు లాంటి కవిత్వ వాక్యాలు అలవోకగా రాసే నా ఖచ్చితమైన పుట్టిన రోజు ఏదో కూడా నాకు తెలియదు. స్కూల్ లో చేరినప్పుడు రికార్డ్ లలో రాసుకోవడానికి మా టీచర్ రాసిన పుట్టిన తేదీ నే నా అధికారిక పుట్టినరోజు. ఆ తరువాత నాకు సోదర సమానుడైన స్నేహితుడు చాలా శోధించి, హాస్పిటల్ రికార్డ్ లన్నీ వెతికి 1955 జనవరి 6 నా పుట్టిన రోజు అని తేల్చాడు. నేను అసోం , గోలాఘాట్ జిల్లా లోని మీకిర్ చాంగ్ టీ ఎస్టేట్ లో పుట్టాను. తేయాకు తోటల్లో అమ్మా నాన్న పనిచేసేవారు. నాన్నది ఒడిషా లోని కలహండి , అమ్మది సంబల్ పూర్. టీ తోటల్లో పనిచేయడానికి వచ్చి వాళ్ళు పెళ్ళి చేసుకుంటే నేనిక్కడ అసోం లో పుట్టాను . మా అమ్మ 13 మందికి జన్మనిస్తే ఏడుగురు మాత్రమే మిగిలారు. పేదరికం కారణంగా కేవలం ఇద్దరికీ మాత్రమే వాళ్ళు ఒకరకమైన చదువు చెప్పించగలిగారు. మిగతా వాళ్లంతా చిన్న వయసు లోనే టీ తోటల్లో పనికి కుదురుకున్నారు. మొదట్లో నేను మా టీ ఎస్టేట్ కి వచ్చిన గురువు ద్వారా ఒడియా నేర్చుకున్నాను. ఆయన వెళ్ళిపోయాక హిందీ చదువుకున్నాను. కానీ ఒకరోజు నా స్నేహితుడు

"ఓ మూర్ అపునర్ దేశి " అనే పాట పాడటంతో విన్న నేను మైమరచి పోయాను. ఆ పాట అస్సామీ భాషలోది అని తెలుసుకున్నాక దగ్గర లో వున్న స్కూల్ కి వెళ్లి అస్సామీ చదువుకున్నాను

**

రాజాబారి స్కూల్ లో చదువుకున్నప్పుడు మంచి టీచర్లు ఉండేవారు. అలాంటి టీచర్లు దొరకడం నా అదృష్టం. నేను ఐదవ తరగతి లో వున్నప్పుడే హోమెన్ బోర్గోహైన్ నవల చదివాను. అది ఎంత వరకు అర్థమైనదో చెప్పలేను. కానీ అలా చదవడం అలవాటు అయింది. విక్టర్ హ్యూగో లే మీజరబుల్స్ లాంటి అనువాదాలు చదవడం మొదలు పెట్టాను. కాలేజీ కి వచ్చాక ఇంగ్లీష్ లో పుస్తకాలు డిక్షనరీ సహాయం తో చదవసాగాను 9 వ తరగతి లో ఉండగా స్కూల్ మ్యాగజైన్ కి ఎడిటర్ గా చేశాను. ఆ మ్యాగజైన్ కోసం బసంత ఉత్సవ్ అనే వ్యాసం రాసాను . అదే నా మొదటి రచన . యూనివర్సిటీ కి వచ్చాక కవిత్వం అనే పురుగు నన్ను కుట్టింది. డైరీ లో రాసుకున్న ఒక కవితను మిత్రుడు ఒకడు తీసుకుని వెళ్లి హోమెన్ బోర్గోహైన్ కి ఇస్తే ఆయన దానిని సాదినియా నాగరిక్ లో మొదటి పేజీలో ప్రచురించారు . అప్పటినుండీ నా సాహిత్య ప్రయాణం మొదలు అయింది

**

కొన్నాళ్ళు వివిధ ప్రయివేట్ ఉద్యోగాలు చేసాక 1984 లో అసోం టూరిజం డిపార్ట్మెంట్ లో చేరాను . 2016 లో వుద్యోగం నుండి రిటైర్ అయ్యాను . టీ తోటల్లో హోమెన్ బోర్గోహైన్ ను చదువుకున్నప్పుడు నేను ఊహించుకున్న హోమెన్ బోర్గోహైన్ రూపం ఒకటి నేను చూసిన హోమెన్ బోర్గోహైన్ రూపం ఒకటి. రెండింటికీ పెద్దగా తేడా లేదు. ఆయన నాకు దైవసమానుడు. నా మొదటి కవిత Adhrishyotar




Birudhe అంటరానితనానికి వ్యతిరేకంగా రాసిన విప్లవాత్మకమైన కవిత. అప్పర్ అసోం లో పెరగడం చేత ఆది వాసిని అయిన నేను ఎలైట్ అసోం కమ్యూనిటీ తో కూడా తేలికగా కలిసిపోగలిగాను . నేటివ్ అమెరికన్ పోయెమ్స్ అండ్ సాంగ్స్ అన్న పుస్తకం నాకు పెద్ద ఇన్స్పిరేషన్ . ఆ స్ఫూర్తి తోనే సోమా, లోథా లాంటి నాగా గిరిజన తెగల లో ఉన్న ఓరల్ పోయెట్రీ ని డాక్యుమెంట్ చేసాను . అది గౌహతీ బుక్ ఫెయిర్ లో ఆవిష్కరణ జరిగింది. కానీ ఇంకా చేయాల్సింది చాలా వుంది. ఈశాన్య భారతం లోని అన్ని తెగల మౌఖిక సాహిత్యాన్ని, సంగీతాన్ని డాక్యుమెంట్ చేయాలన్నది నా కల

## ప్రజాస్వామ్యమా ఇలా ఎన్నాళ్ళు?

సమీర్ తంతి అనువాద కవిత

ప్రజాస్వామ్యమా .....?
ఇంకా ఎన్నాళ్ళు ఇలా

తల దించుకుని
మోకాళ్ళ మీద నిలబడి
కళ్ళు మూసుకుని

నీ వికృతీకరణకు అంతం లేదు
నీ అవమానానికి అంతం లేదు
నీ సమాధి స్వరాన్ని వింటున్నాను
ప్రజాస్వామ్యమా
నా జీవితం తో సహా
నిన్నెంత ప్రేమించాను
నీ పెదవులను కలిపి కుట్టటం చూసాను
నీ కళ్ళకు గంతలు కట్టటం చూసాను

గొంతెత్తి అరవాలనుకున్నాను
నీకు ప్రమాదం జరుగుతుందని అరవలేకపోయాను

నిన్ను అడగలనుకున్నాను
నువ్వు గాయపడతావనే భయం తో అడగలేకపోయాను

ప్రజాస్వామ్యమా ....!
నీ లోపల చెప్పలేనంత చీకటి వుంది

బయట మాత్రం అల్లర్ల కాంతిని చూస్తున్నాను
ప్రజాస్వామ్యమా ....!
నువ్వు చిరకాలం వర్ధిల్లాలి

నువ్వొక బంజరు భూమిగా మారకముందే
నువ్వొక నెత్తుటి మరక గా మారకముందే
ఏదో ఒకరోజు నీకోసం మాట్లాడనివ్వు

ప్రజాస్వామ్యమా ....!
నువ్వొక దుఃఖాశ్రు సముద్రానివి కాక ముందే
నీ హృదయం లోనుండి
నన్ను నేను చెరిపి వేసుకుంటాను

# ఒక నదిని గురించి...

ఒక నది పుట్టింది, కొండల్లో కాదు, ఒక వూళ్ళో
దాని పుట్టిన తేదీ నమోదైంది గానీ
పుట్టినపుడు అది నాలుగు చుక్కల నది అని
ఎవరూ గుర్తు పట్టలేదు , గుర్తింపులకు ఆవల
వెలివేయబడ్డ నెలవులో అది పుట్టింది

నది చిన్నప్పుడు పాటను నేర్చుకోవాలని వెళ్ళింది
"నువ్వు బయటనే , లోనికనుమతిలేదు "
ఆ కఠిన స్వరానికి తలొగ్గి బయట నుంచే విన్నది
తన నీళ్ళన్నీ కన్నీళ్ళు కాగా
నేర్చుకున్న పాట చేదు రాగంగా గుండెలో వుండి పోయింది
ఊళ్ళ లోగిళ్ళ లోకి ప్రవేశం లేదు కనుక
బయటే పారింది బహిష్కృతగా!

కుంగి ముడుచుకుపోయి ఇంకి పోలేదు
నాలుగు చుక్కల ప్రాణం పాయై పాయలై
పెరిగి పెరిగీ పారీ పారీ
దూర తీరాలనూ చేరింది కొత్త రాగాలను నేర్చుకోవడానికి
దాని స్వరానికీ ఉరవడికి స్ఫురత్కాంతికి
ఆ తీరాలు నివ్వెర పోయాయి నీరాజనాలిచ్చాయి
తీరా స్వస్థానానికి తిరిగొస్తేమళ్ళీ అది బృహిష్కృతే !

ఇక ఇట్లా కాదని అది తన నడకను ఉధృతి చేసి
పొంగులెత్తి ఆత్మస్వరాన్ని నలుదిక్కుల్లో వినిపించింది
నదులకు వెలివేతేమిటని నిలదీసింది
వెలివేతలో విరూపమైన ముఖాలు
నదిలో తమ స్వరూపాన్ని చూసుకున్నాయి

నది వెంట నడిచాయి దాని పాటనందుకుంటూ

గీతకు అవతలే కదలాలని, దాటి రావద్దని
ఆవల పెట్టిన అన్ని పెత్తనాలను బేఖాతరు చేసి
అన్నిగీతలను చెరిపేస్తూ నది ముందుకు దూకింది
ఎదిగీ ఎదిగీ అదిఒక మహానది అయింది
దేశమంతటికీ కనిపించేంత , వినిపించేంత

తనపై విసిరిన రాళ్లను ముంచి వాటి మీదుగా
ముందుకుప్పొంగింది
సంస్కారాన్ని మంటగలిపే సకల కల్మష కాండలను
కడిగేసే పనిలో నిమగ్నమై హోరెత్తింది
ఆ హోరును విన్నకొన్ని గొంతులు ఓహో ఆహా అన్నాయి
వాటికది మోహపడలేదు మోకరిల్లలేదు
మరింత ఉధృతితో తన పాటను వినిపిస్తూ
ఒడ్డున పడి ఇంకిపోతున్న
కోట్ల నీటి చుక్కలను నదులుగా సమీకృతం చేసే
పనిలో రాత్రుళ్ళను కూడా పగళ్లుగా చేసుకుంది

విరామం లేదు, విరమణ లేదు, విశ్రమీగడం లేదు
దాని నడకే ఒక బోధనై సమీకరణయి, పోరాట చేతనై
ఒంటరి నీటి చుక్కలకూ పాయలకూ
పెద్ద దిక్కయింది ప్రేరణ అయింది ఊపిరి అయింది


పడి వుండడం కాదు కదిలి పోరితేనే
బతుకు తలెత్తి మనగలదని తెలిపింది
అందుకు తానే ఒక ప్రాణమున్న ఉదాహరణ అయింది

మొదలై కదిలివచ్చిన దారిలోనే
కన్ను మూసేది లేదని అనుకుని
కొత్త తొవ్వను వెతుకుతూ సాగింది
ఒక మలుపు దగ్గర బుద్ధుని రాగం విన్నది
విడదీసే అన్ని గోడలను బద్దలు కొట్టాలనే నది
ఏ గోడలనూ కట్టని బౌద్ధం వైపు మళ్ళింది

ఎన్నో బీళ్లను సారవంతం చేస్తూ
ఎన్నో హద్దు రాళ్ళను అధిగమిస్తూ
ఎన్నో నోళ్లకు స్వేచ్ఛారాగాలను నేర్పుతూ
ఎన్నో కాళ్ళకు ధీరత్వ గమనాన్ని కూర్చుతూ
సంరంభంతో బిందుసైన్యవాహినిలా సాగిన నది
కడకు నీలి కడలిలో కలిసింది

కానీఅది అంతరించలేదు
పారిన ప్రతి దారిలో దాని ఆనవాళ్ళున్నాయి
పొడిబారిన గొంతులకు తడి ఊపిరవుతున్నది
చెల్లాచెదురై విలవిలలాడే విడివిడి వేళ్ళను దగ్గరికని
దోసిళ్లను పిడికిళ్లుగామలుస్తున్నది
చౌరస్తాలలోనేనా కోట్ల కొద్ది గుండెల్లో
రక్తనాళాల్లోనూ కదులుతూ కదిలిస్తున్నది
తలెత్తి సాగే దారుల్లోకి
అంతర్గత చోదక ద్రావకమై !


నది
ఇప్పుడూ ఎప్పుడూ
అందరి ఆస్తి !



**- దర్భశయనం శ్రీనివాసాచార్య**
**94404 19039**

## కొత్త నివాసం

ఇప్పటికీ నేను నీ స్కూల్ యాత్ర
తొలి రోజు ఫోటో చూస్తున్నాను.
ఒకవైపు అమ్మ,
ఒకవైపు నేను,
మధ్యలో నీ చేతిని పట్టుకున్నాం.
వెనుక స్కూల్
చిన్న బ్యాగ్, నీటి సీసా.
గేటు తెరిచి వాకిలి వరకు వచ్చి
నిన్ను వదిలేశాం.
కన్నీళ్లు రానున్న
కళ్లతో చూస్తున్నావు
మా కళ్ళు కూడా తడిచిపోయాయి.



ముప్పై అయిదు సంవత్సరాలు గతించాయి.

ఇప్పుడు నేను కూడా కొత్త ప్రదేశానికి వచ్చాను.
వృద్ధాశ్రమం, నా కొత్త నివాసం.
ఒకవైపు కోడలు, ఒకవైపు నువ్వు,
రెండు భుజాలపై చేతులు ఉంచి నేను.
అవును, ఈ సారి ఫోటో అవసరం లేదు.
వాకిలి వద్ద వదిలేసి మీరు వెళ్లిపోయారు.
కరుణ నిండిన కళ్లతో నేను చూస్తున్నాను.
మీరు తిరిగి చూడటం కూడా అవసరం అనుకోలేదు.
కొత్తగా కొన్న ఖరీదైన కారులో కూర్చొని
మీ దారిలో దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయారు..!

**అస్సామీ మూలం: డాక్టర్ ప్రణయ్ ఫూకన్**
**హిందీ అనువాదకులు : కిషోర్ కుమార్ జైన్**
**తెలుగు సేత: డా పెరుగు రామకృష్ణ**


# గొర్ల కాపరుల కథలు

**- కె.పి అశోక్ కుమార్**

గొర్రెలు మేకల పెంపక వృత్తిలో నిమగ్నమవుతూ సమాజ అవసరాలను తీర్చే కురుమలు, విద్యా ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా వెనుకబడి ఉన్నారు. చాలా తక్కువ శాతం మందికి ఐదు ఆరు ఎకరాల భూమి ఉన్నప్పటికీ పండించుకునే స్తోమత లేక, పంటబెట్టినా చేతికి రాక కడు దుర్భర జీవితాన్ని వెల్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధానంగా వృత్తిపైన ఆధారపడే పోషణ జరుపుకుంటున్నారు. మాంసం ఉత్పత్తి, తోళ్ళ ఉత్పత్తి, పాల ఉత్పత్తి, ఎరువు ఉత్పత్తి, ఉన్ని ఉత్పత్తి ఇలా అనేక రకాల ప్రజా అవసరాలు గొర్రెల మేకల పెంపకం వృత్తి ఆధారంగా ఉన్నాయి. కురుమలు చేస్తున్న వృత్తిలో కూడా మధ్య దళారులు ప్రవేశించి దోపిడి చేస్తున్నప్పటికీ, ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు.

కురుమల జీవన విధానం స్థితిగతులు, వెనుకబాటుతనం, వాళ్లపై కొనసాగే రకరకాల దోపిడీలను వివరిస్తూ వచ్చిన సాహిత్యంలో ఆరు నవలలు మాత్రమే కనిపిస్తాయి. ఇవన్నీ రాయలసీమ నుండే రావడం గమనించదగ్గ విషయం. ఎక్కువ భాగం రాయలసీమ రచయితలు కురుమల మీద కథలు వ్రాయగలిగారు. వీటన్నిటికీ కారణం కురుమల జనాభా రాయలసీమలో ఎక్కువ భాగం ఉండటమేనని అర్థమవుతుంది. తెలంగాణ పరంగా చూస్తే " డోలు దెబ్బ" పేరుతో గొల్ల కురుమ పాటల సంకలనం వచ్చింది. చెదురు మధురుగా వచ్చిన కథలలో నుండి కొన్ని జ్వలిత సంకలించిన "మల్లెసాల"లో చోటు చేసుకున్నాయి. గొల్ల కురుమ కథలంటూ గతంలో ప్రభంజన్ యాదవ్, కాలువ మల్లయ్య, అరె భారతి ల సంపాదకత్వంలో "వేపకాయంత నిజం" అనే సంకలనం వెలువడినా అది పాఠకులకు నిరాశనే మిగిల్చింది. దానికంటే మిన్నగా ఇప్పుడు 18 కథలతో మహేందర్ బర్ల ,సంగిశెట్టి శ్రీనివాస్ ల సంయుక్త సంపాదకత్వంలో " గొంగడి" పేరుతో గొర్ల కాపరుల కథల సంకలనాన్ని తీసుకురావడం అభినందనీయం.

మొదటినుండి గొర్రెల కాపరులను బెదిరించి,తో హింసించి మందలో నుండి గొర్రెలను ఎత్తుకుపోవడం హక్కుగా భావించి దౌర్జన్యాలను జరిపి ఒక దశ ఉండేది. నిజాం పాలనలో ఒక దొర స్వయంగా గొర్రెల మందపై దాడి చేసి కాపరిని చంపి తనకు కావలసిన గొర్రెల్ని ఎత్తుకుపోవడాన్ని బోయ జంగయ్య




"తోడేళ్లు" కథలు చిత్రీకరించారు. అడవిలో మేకలు గాచుకునే కురవోళ్ళ మీద ఫారెస్టోళ్ల దోపిడీ దౌర్జన్యాలను వివరిస్తూ నందిని సిద్ధారెడ్డి "పుల్లరి" కథను రాశారు. వారు తిరుగుబాటు చేస్తే తప్ప పరిస్థితులు బాగుపడవని ప్రబోధించారు. గొర్రెల మందలోంచి మంచి మేకపోతును ఎట్టి పిల్లగా ఉచితంగా ఇవ్వాలనే గ్రామ పెద్దల నుండి, మేకల మీద కన్నేసిన సాయెబులనుండి దాన్ని కాపాడుకోలేక బీరయ్య ,దాన్ని ఎంతో బాధతో అడవిలో వదిలేసి వస్తాడు.

కురుమలు తాము పెంచే గొర్రెలను, మందను తమ ప్రాణం కంటే మిన్నగా చూసుకుంటారు. తప్పిపోయిన "గొర్రె పిల్ల" కోసం యజమాని పడిన బాధ, అది దొరకడంతో సంతోషంగా మారిపోతుంది. తన ప్రాణాలకు తెగించి తోడేళ్ల భారి నుండి గొర్రెలను, యజమానిని కాపాడిన కుక్క " సేవకుడు" కథలో కనిపిస్తుంది. గొర్ల మందను ప్రాణంగా కాపాడుకునే కాపరి తోడేలుతో పోరాడి తన గొర్రె పిల్లల్ని కాపాడుకుంటాడు. కానీ దళారీలనే "తోడేళ్ల" నుండి తాను విముక్తుడు కాలేకపోతాడు.

కురుమల జీవితాలు ఎంత కష్టనష్టాలతో కూడుకొని ఉంటాయో, వారు బ్రతకడం కోసం నిత్యం పోరాటం చేయాల్సి ఉంటుందని తెలిపే కథలు కొన్ని ఉన్నాయి. దొరల ఇండ్లలో, పెద్ద రైతుల ఇండ్లలో పాలేర్లకు, కుక్కలకు రోజూ బువ్వ పెట్టాల్సి వస్తే వాళ్లకు వేరే వండుతారు. అదే కురుమల ఇండ్లలో వాళ్లు తినంగా మిగిలింది కుక్కలకు పెడతారు. ఇండ్లలో కుక్కలకు, పాలేరోళ్లకు పెట్టేది కూడా వారికి దొరకదు గట్టుక, చలిబువ్వ, పాచిపోయిన అన్నం కలిపి "కుక్క సద్ది" అంటారు. అది తిన్న కుక్కలే మందను కాపలా కాస్తాయి. కొన్నిసార్లు మనుషులకు కూడా మిగిలేది ఆ కుక్క సద్ది కావడమే విచారకరం. వ్యవసాయం లో నష్టం రాగా ఎర్ర కొమరుడు పొలం అమ్మి గొర్ల మందను కొంటాడు. సేటు వచ్చి అప్పు కింద గొర్లను జప్తు చేస్తాడు. బతకడానికి వన్యప్రాణులను తెచ్చి అమ్ముతుంటే పోలీసులు పట్టుకుపోతారు. చాలా రోజులకు ఆ ఊరికి తిరిగి వచ్చి రంగురాళ్ల దుకాణం పెట్టుకుంటే, అక్కడ కూడా సేటు వచ్చి వేధిస్తుంటే భరించలేక గొంతు పిసికి చంపివేయక తప్పలేదు. మొత్తానికి ఎర్ర కొమరని బతుకు ఎలా అన్యాయమైపోయిందో "అంగడి" కథలో చూడవచ్చు. వలస పోయిన పాలమూరు లేబర్ వ్యధాభరిత జీవితాలు ఒకవైపు. ఆసామి అప్పు తీర్చడానికి కొడుకు రామును గొర్లు కాయడానికి పంపాల్సి వస్తుంది. పాలమూరు నుండి ఏటూరు నాగారం అడవిలోకి గొర్లను తీసుకుపోవడం, గోర్లు తప్పిపోవడం ,అడవి జంతువులు ఎత్తుకుపోవడం ఇదంతా నాకు తెలియదని ఆసామి వాడిని చితకబాదడంతోపాటు, తన అప్పును పెంచుకుంటూ పోతాడు. వాడి హింసను భరించలేక రాము పారిపోయి దారిలో కనిపించిన తెలంగాణ ఉద్యమంలో చేరిపోతాడు అని "గొర్లు" కథలో గీతాంజలి రాశారు. ఉద్యమం సఫలమైనా, విఫలమైనా రాము లాంటి వారి బతుకులు అలానే కొనసాగుతాయనే ఎరుక పాఠకునికి ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇక్కడ బతకలేక ఏదో ఒక పని చేసుకుని బతకదామని అరబ్ దేశానికి పోయిన నరసయ్య ఎడారిలో గొర్రెల కాపరిగా పడిన వేదన నరక "యాతన" ను జూకంటి జగన్నాథం కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించారు.

మన సమాజంలో ప్రతి కులానికి సంబంధించి కొన్ని నియమాలు, కట్టుబాట్లు ఉంటాయి. అలాగే కురుమలకు కూడా. కురుమలలో ఎవరిదైనా గొర్రె గాని, మేక గాని తప్పిపోయి పక్క మందలకో, పక్కూరి మందలకో పోతే తిరిగి వాళ్లది వాళ్లకు పట్టిచ్చే సంస్కృతి కురుమ లలో ఉంటుంది. వాటి గురించి ఎవరూ రాకపోతే, కొన్ని రోజులు చూసి కులంల కలుపుకుంటారు. బీరప్ప మందలోకి దారి తప్పి వచ్చిన గుడ్డి గొర్రెను కోసుకొని తిందామని మిత్రులు ఒత్తడి చేయడంతో ,బీరప్పకు ఆ పని చేయక తప్పలేదు. మరుసటి రోజు గొర్రెను వెతుక్కుంటూ బండి కొమర వచ్చి గొర్రెను కోసుకొని తిన్నారన్న సంగతి కుల పెద్ద కు ఫిర్యాదు చేస్తాడు. కుల పెద్ద సంగతంతా తెలుసుకొని ఒక గొర్రెకు బదులుగా నిందితుల నుండి రెండు గొర్రెలను వసూలు చేసి పంపిస్తానని చెప్పి తీర్పునిస్తాడు.

ఒకవైపు సమాజంలో దైవభక్తిని పెంపొందించడానికి, మరోవైపు తమదైన కళారూపంతో ప్రజల్ని సంతోష పెట్టడానికి ఎన్నో సంప్రదాయాలు పుట్టుకొచ్చాయి. వాటిని అంటిపెట్టుకొని వస్తున్న వాళ్ళకి చివరికి మిగులుతోంది కన్నీరే. అలాంటి ఓ గురవయ్య గాధే రాసాని రాసిన "మల్లేష్ కుక్క". కురుమలలో ప్రతి తరంలోనూ పెద్ద కొడుక్కి గౌరవ దీక్ష ఇప్పించడం వారి వంశపారంపర్య ఆచారం. మారుతున్న కాలంలో ఇలాంటి ఆచారాలను సంప్రదాయాలను గౌరవాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. గురవయ్యల వేషాన్ని చూసి గంతులేసి బతికే బిచ్చగాళ్ళు అనుకుంటున్నారు జనం. కుటుంబాన్ని సాకే పరుంబడీక లేక, గౌరవము లేక ఈ సాంప్రదాయాన్ని నమ్ముకుని బతకకపోతే ఏమి? ఎవరికీ ఈ పనికిరాని ఈ సంప్రదాయం ఎందుకు? అని వెంకట మల్లయ్య ప్రశ్నించడం మనల్ని ఆలోచింపజేస్తుంది. 12 ఏళ్లకోసారి చేసుకోవాల్సిన కురవోళ్ళ పెద్ద పండుగ. క్రమంగా దాని విశిష్టతను గొప్పదనాన్ని కోల్పోతున్న వైనం. పెరిగిపోతున్న వ్యాపార సంస్కృతి వల్ల అది ఎలా పూర్వవైభవాన్ని కోల్పోతున్నదో " అవశేషం" పేరుతో బండి నారాయణస్వామి అద్భుతంగా వివరించారు.

ఈ కథలు కురుమల ఆర్థిక, సామాజిక ,సాంస్కృతిక చరిత్రను తెలియజేస్తాయి. ఇవి తెలుసుకొని వారి భవిష్యత్తును నిర్దేశించుకోవడానికి కూడా ఉపకరిస్తాయి. ఇందులో ఉన్న 18 కథలలో 16 కథలు తెలంగాణ నుండి రాగా, కురుమల సంస్కృతిని తెలియజేసే రెండు అరుదైన కథలు రాయలసీమ నుండి రావడం విశేషం. ఈ గొర్ల కాపరుల కథలను సంకలనంగా వెలుగులోకి తీసుకొని రావడంలో సంపాదకులు బర్ల మహేందర్, సంగిశెట్టి శ్రీనివాస్ ల కృషి ప్రశంసనీయం.

**(" గొంగడి" గొర్ల కాపరుల కథలు. సంపాదకులు: డాక్టర్ మహేందర్ బర్ల, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ .ఫోరం ఫర్ కన్సర్నెడ్ బీసీస్., హైదరాబాద్. వెల 150 రూపాయలు, పేజీలు 184. సోల్ డిస్ట్రిబ్యూషన్: నవోదయ., హైదరాబాద్)**

## డంపింగ్ యార్డ్ తరలింపు కోసం శ్రీ వరసిద్ధి కాలనీవాసుల నిరసన




**కరీంనగర్, మహా:** కరీంనగర్ నగరపాలక సంస్థ కోతిరాంపూర్ 9వ డివిజన్ లోని శ్రీ వరసిద్ధి వినాయక కాలనీ వాసులు డంపింగ్ యార్డ్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రోజున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరసిద్ధి వినాయక కాలని నుండి కోతిరాంపూర్ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ ప్రముఖులు మాట్లాడుతూ డంప్ యార్డ్ తొలగింపు కోసం, సమస్య పరిష్కారం కోసం నేడు పార్టీలకతీతంగా ఇట్టి నిరసన చేపట్టడం జరిగిందన్నారు. కోతి రాంపూర్ ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని డంపు యార్డును శాశ్వతంగా తొలగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ రాంపూర్ ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందన్నారు. ప్రజల ఆరోగ్యాలకు , జీవితాలకు డంపింగ్ యార్డ్ పెను ప్రమాదంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం , జిల్లా యంత్రాంగం, మున్సిపాలిటీ అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ తొలగించడానికి చర్యలు చేపట్టాలని , లేకపోతే తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక కాలనీ అధ్యక్షులు నా రెడ్డి గుణిందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బొద్దుల జగదీష్, ప్రధాన కార్యదర్శి బండిపల్లి పరశురాములు, రామన్న , ఇజ్జగిరి శ్రీనివాస్ ,గంటా మోహన్ రెడ్డి ,హరి మోహన్, మాజీ కార్పొరేటర్ లెక్కల వేణు, విజ్ఞాన్ శ్రీనివాస్, బిజెపి ఈస్ట్ జోన్ ప్రధాన కార్యదర్శి మాసం గణేష్, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

### హక్కులను కాపాడుకోవాలి.. పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

### రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి



రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి...

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకమై పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకొని హక్కులను కాపాడుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షులు మంఖాల దాసు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన "జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్" ర్యాలీలలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి గారు మాట్లాడుతూ... ఆనాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరచిన దాని ప్రకారం బడుగు బలహీన వర్గాలతో పాటు దళిత గిరిజనులకు రిజర్వేషన్లతో పాటు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో సమాన వాటా కల్పించాలని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. దీంతో పాటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఇందిరాగాంధీ హయాంలోనే పొందుపరిచినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దేశంలో, రాష్ట్రంలో పేద ప్రజలకు, దళిత గిరిజనులకు న్యాయం జరుగుతుందని వివరించారు. రాజ్యాంగం రక్షణ కోసం గ్రామస్థాయి నుండి యువకులు ప్రజలు చైతన్యం కావాలని ఆయన కోరారు. భారతదేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటుందని గత పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుందన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీసుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాల రాస్తున్నదని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. దేశ ప్రజలకు సమన హక్కులు, సమ న్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్న బీజేపీ పాలకుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను కాలరాస్తూ కట్టు, బొట్టు, తిండి, పూజ అన్నిటి పైన ఆంక్షలు పెడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. అంతే కాకుండా ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్ షా పార్లమెంట్ లో రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సృష్టికర్త అయిన డాక్టర్ బీఆర్ అంభేద్కర్ని ఘోరంగా అవమానించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడి పైన ఉంది అన్నారు అనంతరం ఇబ్రహీంపట్నం మండలం లోని చెర్లపటేల్ గూడ, తుర్కగూడ, కప్పపహాడ్, తులేకలాన్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో గ్రామస్తులతో కలిసి ర్యాలీలో పాల్గొనటం జరిగింది. అనంతరం పహాల్గం ఉగ్రదాడిలో మరణించిన వ్యక్తులకు సంతాపం ప్రకటించారు. కాశ్మీర్ లోయలో పహాల్గంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షులు మంఖాల దాసు మాట్లాడుతూ... దేశం కోసం, దేశ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీ, నేడు మన ఈ స్వతంత్ర భారతానికి వెలుగు చూపిన మహనీయుడు అని కొనియాడారు. స్వతంత్ర భారతానికి ప్రజాస్వామ్యం దేశంగా తీర్చిదిద్దడానికి రాజ్యాంగాన్ని రచించిన రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. నాడు అంటరానితనాన్ని అంతమొందించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనుడు అని అన్నారు. నేడు ప్రపంచంలోనే గొప్ప మేధావిగా ప్రపంచ దేశాలకు కీర్తించిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఆయన చేసిన సేవలను మరవలేనివని పేర్కొన్నారు. నేడు దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశాన్ని చిన్నాభిన్నం చేస్తూ భారత రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ, నాటి మహానుభావులు, నాయకులు చేసిన సేవలను కాలరాస్తూ నిరంకుశ పాలన చేస్తున్న, ఈ కేంద్ర ప్రభుత్వాన్నికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ నందగిరి గిరిధర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఏదుళ్ళ పాండురంగారెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, ఈ సి. శేఖర్ గౌడ్, భూపతిగళ్ళ మహిపాల్, కొత్తకుర్మ మంగమ్మ శివ కుమార్, కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్, మంఖాల కరుణాకర్, ఏఎంసీ డైరెక్టర్లు మస్కు నర్సింహా, దొంతరమోని రాజు గులాం అక్బర్, సుబ్బురు పాండు, దారు రాఘవేందర్, ఎ భరత్ రెడ్డి, ఈ భరత్ రెడ్డి, మడుపు సాయితేజ, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శులు లిక్కి వెంకట్ రెడ్డి, కాయల శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు హనుమండ్ల ఆనంద్, సేవాదళ్ మండల అధ్యక్షులు గొరిగే నర్సింహా, గుజ్జుల శ్రీధర్, పూజారి రాకేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సికిందర్, రాఘవ, జయ ప్రకాశ్, ఎన్ఎస్ యుఐ నాయకులు కార్తిక్, అయాన్ పటేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి బీసీ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు




**కరీంనగర్, మహా:** కాశ్మీర్ పహాల్గం లో భారతీయులపై జరిగిన టెర్రరిస్టులు దాడికి నిరసనగా టెర్రరిస్టుల దాడిలో చనిపోయిన వారి ఆత్మ శాంతించాలని బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల తో నివాళులు అర్పించారు. శనివారం సాయంత్రం కరీంనగర్ లోని మహాత్మా జ్యోతి బా పూలే మైదానంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవత్తులతో నివాళుల కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ , తహశీల్దార్ నరేంద్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ , రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరశురాం గౌడ్ లు పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం ఆర్డీఓ మహేశ్వర్ సార్ మాట్లాడుతూ నిరాయుధులైన పర్యాటకుల పై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం హేయమైన చర్య అని అన్నారు.ఈ దాడిని దేశంలోని ప్రజలందరూ ముక్తకంఠం తో ఖండించాల్సిన విషయమని అన్నారు. భారతీయులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేయడం అత్యంత బాధాకరమని చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని తీవ్రవాదులను అత్యంత కఠినంగా శిక్షించాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల అంజయ్య గౌడ్ , నాయబ్ తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి , గిర్దావార్ పట్టెంశ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల సురేందర్ , మంతెన కిరణ్ , దుంపటపల్లి మురళి , మహిళా సంఘం అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ , యువజన సంఘం జిల్లా కార్యదర్శి శీలం అజయ్ కుమార్, జిల్లా నాయకులు ఆకుల సురేష్, తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్, వాయిల రాజకుమార్ , సాయిరి శరత్ కుమార్ , పురుషోత్తం ఆశిష్ గౌడ్, పి.శ్రీనివాస్, రఘు మరియు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

### వృత్తి నైపుణ్యత కోసం యువతకు శిక్షణ కార్యక్రమాలు

### దేశంలో ఎక్కడైనా ఉద్యోగం చేసే సంకల్పం ఉండాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**కాటారం, మహా :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లాలో వృత్తి నైపుణ్యత పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని యువకులకు యువతి యువకులకు ఉద్యోగం ఎక్కడ వచ్చినా చేసేందుకు సంసిద్ధమై ఉండాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువత ఉన్న చోటనే ఉద్యోగం చేయాలన్న లక్ష్యాన్ని విడనాడాలని స్పష్టం చేశారు. జిల్లాలో సింగరేణి ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యం సాధించడానికి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు లేక మద్యం, మత్తు పదార్థాలు కు బానిసలవుతున్నారని, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పన వల్ల జీవనోపాధి. లభిస్తుందని, తద్వారా ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు ఎంతో సంతోష పడతారని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా యువత కెరీర్ కు ఎంతో దోహదపడుతుందని అన్నారు. 80కి పైగా వివిధ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. భవిష్యత్ అంతా డిజిటల్ యుగంగా మారబోతోందని తెలిపారు. ఈనేపథ్యంలో వివిధ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువతలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేందుకు నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వం హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. స్కిల్ యూనివర్సిటీ అనేది దేశంలో మరెక్కడా లేదని అన్నారు. భవిష్యత్‌లోనే జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ని అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. రాష్ట్ర ప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. యువత భవిష్యత్తు కొరకు పరిశ్రమలను తీసుకురావడం ద్వారా లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలను కల్పించాలనే సంకల్పంతో ఈ రోజు మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు, ఈ జాబ్ మేళా నిరంతరంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రతి ఆరు నెలలకొకసారి జాబ్ మేళాలు నిర్వహిస్తామని, వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఎంపికైన నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడం, శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా కృషి చేస్తామన్నారు. నిరుద్యోగ యువత ఆయా గ్రామాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే చేతుల మీదుగా అందజేశారు. విస్తృతంగా ప్రచారం చేసిన మీడియాను అభినందించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 80 పరిశ్రమలు జాబ్ మేళాలో పాల్గొన్నారని, 10 వేల మందికి పైగా నిరుద్యోగులు ఆన్లైన్ ద్వారా నమోదు అయినట్లు తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు వేసి యువతకు సమాచారాన్ని చేరవేసినట్లు తెలిపారు. యువత అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంపెనీల్లో మన రాష్ట్రంలో ఏ జిల్లాలో అవకాశం కల్పించిన అక్కడికి వెళ్లి ఉద్యోగం చేసుకుంటూ తదుపరి మరింత ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.



### ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వానికి

## మొదటి ప్రాధాన్యం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్

**షాద్ నగర్,మహా:** అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని చౌదర్ గుడెం, కొందుర్గ్, ఫరూఖ్ నగర్, కొత్తూర్, నందిగామ, కేశం పెట్ మండలం మరియు షాద్ నగర్ పట్టణానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 13.37,500 (పదమూడు లక్షల ముప్పై ఏడూ వేలు 500) విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకుల తో కలిసి చెక్కులను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తదితరులు..

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



**కాటారం, మహా :** దేశంలో భారత రాజ్యాంగం ను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆ దిశగా అవగాహన పెంచుకొని కృషి చేయాలని మహదేవ్పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు పిలుపునిచ్చారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ మండలంలోని మల్లంపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ నినాదంతో అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రను స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామంటూ నాయకులు ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మనువాద సంస్కృతిని ఇచ్చేందుకు కృషి చేస్తుందని బిజెపి, బజరంగ్దళ్, ఆర్ఎస్ఎస్ కుల మతాత్వాలను పెంచి పోషిస్తుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు దండు రమేష్ ఆరోపించారు. కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కరిగే కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డి ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు బడితెల రాజయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి జంపయ్య, మండల కాంగ్రెస్ నాయకులు అయిత రాజిరెడ్డి, కొండ రాజమ్మ, మమత, సింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, నాయకులు పెనుమండ్ర వామన్ రావు, సహేందర్, కృష్ణమూర్తి, మహేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షురాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వరంగల్ కు కదిలిన గులాబీ దండు

- మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళిన గులాబీ శ్రేణులు
- 60 బస్సులు, 310 కార్లలో వరంగల్ సభకుకు వెళ్లిన పార్టీ కార్యకర్తలు, నాయకులు

**షాద్ నగర్,మహా:** వరంగల్ కు నియోజకవర్గ దండు కదిలింది. మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు,నాయకులు, అభిమానులు వరంగల్ సభకు బారులు తీరారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవల్లో భాగంగా వరంగల్ ఎల్కుర్తిలో నిర్వహిస్తున్న సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. 60 ప్రత్యేక బస్సుల్లో, 310 కార్లలో తోపాటు ఇతర వాహనాలలో గులాబీ శ్రేణులు సభకు వెళ్లారని చెప్పారు. ఊహించని స్థాయిలో స్వచ్ఛందంగా పార్టీ అభిమానులు, కెసిఆర్ అభిమానులు సభకు తరలిరావడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. కేశంపేట, కొందుర్గు, చౌదరి గూడెం, కొత్తూరు, నందిగామ, ఫారుక్ నగర్ మండలాలలోని ప్రతి పల్లె నుంచి కార్యకర్తలు సభకు తరలివచ్చారని, రజతోత్సవ సభ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని మరోమారు నిలిపే విధంగా నిలుస్తుందని చెప్పారు. సభకు తరలి వెళ్లిన వారిలో అన్ని గ్రామాల కార్యకర్తలు,నాయకులు, అభిమానులు ఉన్నారు.

## కుడియ తండ అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



**డోర్నకల్, మహా:** స్టేజి తండా గ్రామపంచాయతీ కుడియ తండా అంగన్వాడి కేంద్రం నందు అంగన్వాడి టీచర్ కుమ్మరి కుంట్ల జ్యోతి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషారాణి ముఖ్యఅతిథిగా హాజరై అక్షరభ్యాసం పూర్తి చేసుకున్న ఐదేళ్ల పిల్ల లోపు పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి. ప్రాథమిక పాఠశాల లో చేర్పించడమే గ్రాడ్యుయేషన్ డే ప్రాముఖ్యత అని వివరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమక్షం లో పిల్లలకు గ్రేడ్లు ప్రకటించారు ప్రైవేట్ పాఠశాలల కు దీటుగా అంగన్వాడి సెంటర్లో ప్రీ స్కూల్ విద్యను మరింత బలోపేతం చేయాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కుమ్మరి కుంట్ల జ్యోతి, తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.



### మాకుల వెంకటేశ్వర స్వామి దయతో

## మాకుల జాతర విజయవంతం

### సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

### ఆలయ ఈఓ కలకోట వేణుగోపాల్

**డోర్నకల్,మహా:** కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగు బంగారంగా భాసిల్లుతున్న శ్రీ మాకుల శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర దేవుని దయతో విజయవంతమైందని మాకుల వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఈఓ కలకోట వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ జాతరను అందరి సహాయ సహకారాలతో విజయవంతం చేయగలిగామని, జాతర ఏర్పా ట్లు, నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.విధి నిర్వహణలో సహకరించిన పోలీస్,మున్సిపల్, రెవెన్యూ,ఆరోగ్య,విద్యుత్ తదితర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయా శాఖల అధికారులు,సిబ్బంది, పూజారులు సమన్వయంతో పని చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జారత విజయవంతం చేశారని తెలిపారు. జాతర విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 29వ డివిజన్ లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన మేయర్

### వాసవి కాలనీ రామన్న పేట గాంధీ బొమ్మ ప్రాంతాల్లో పరిశీలన



**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ నగర మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29 వ డివిజన్ పరిధి లోని వాసవి కాలనీ రామన్న పేట గాంధీ బొమ్మ గంగపుత్ర వీధి ప్రాంతాల్లో నగర మేయర్ గుండు సుధారాణి ఆదివారం క్షేత్ర స్థాయి లో పర్యటించారు. ఈ సందర్భం గా స్థానికం గా ఉన్న శానిటేషన్ డ్రైన్ సి సి రోడ్ ల ఏర్పాటు తదితర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకొని పరిష్కరించడానికి గాను అధికారులతో చరవాణి లో మాట్లాడిన మేయర్ వేగవంతం గా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ స్థానికం గా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరు గా అడిగి తెలుసు కోవడం జరిగిందని సుదీర్ఘంగా అపరిష్కృతం గా ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఈ సందర్భం గా మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు ఓరుగంటి పూర్ణ, వడ్లకొండ విజయ్, పసునూరి చందర్, పాకాల సాంబయ్య, దేవరకొండ కృష్ణ, అప్పరాజు, లక్ష్మీ కొలిపాక పద్మ, సౌరం పద్మ, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున

## బయలుదేరిన పట్నం ప్రజలు

### గ్రామ గ్రామాన ఎగిరిన గులాబీ జెండా

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** మహిమ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి వరంగల్ లో నిర్వహించిన రజపోత్సవం సభకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో బిజెపి జెండా ఎగురవేసిన అనంతరం బయలుదేరి వెళ్లారు.



## భారీగా తరలిన గులాబీ శ్రేణులు

**శాయంపేట, మహా :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ పార్టీ అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు హనుమకొండ జిల్లా శాయంపేట మండలం లోని వివిధ గ్రామాలలో గల గల్లీ గల్లీ నుండి బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. మండలం లోని కొప్పుల గ్రామం లో మొదటగా గ్రామ శాఖ అధ్యక్షులు మేకల వెంకన్న బాబాసాహెబ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించి బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం వాహనాల్లో ప్రజలను గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడమే లక్ష్యంగా 2001లో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఉద్యమ పార్టీగా ప్రజలు గుర్తించి పది ఏళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించే అవకాశం ఇచ్చారన్నారు.10 ఏళ్ల కెసిఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా మారిందని,అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన మహోన్నతమైన కారణజన్ముడు కేసీఆర్ అని కొనియాడారు. ఆ తర్వాత 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుందన్నారు.ఇక రానున్న రోజులు బీఆర్ఎస్ వేనని, ప్రజలు చీదరించుకుంటున్న కాంగ్రెస్ పార్టీపై ఉద్యమాలు చేసి,వారి బూటకపు వాగ్దానాలను ఎండగట్టి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి అన్ని స్థానాల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు, గులాబీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

# సింహాచలం చందనోత్సవానికి సర్వం సిద్ధం

అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి వంగలపూడి అనిత

రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉంది

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసాం

సమాన్య భక్తులకు అధిక ప్రధాన్యత ఇస్తున్నాం

**విశాఖ,మహా:** ఈనెల 30న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవం ఘనంగా జరగనుంది. ఉత్సవ ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. పండితులు వేదాశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, వారి సౌకర్యాల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని, పెద్ద సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఐదుగురు మంత్రులతో కూడిన బృందం సమీక్షించారన్నారు. అంతరాలయ దర్శనాలు ఉదయం ఆరు గంటలకు ముగిసేలా ఏర్పాట్లు చేశామన్నారు.



ఇటీవల ఎన్డీయే ప్రభుత్వ అధ్వర్యంలో జరిగిన అనేక ఆలయ ఉత్సవాల విజయవంతం నేపథ్యంలో ఈ ఉత్సవం పట్ల భక్తుల్లో విశ్వాసం పెరిగిందని, స్వామివారి నిజరూప దర్శనానికి సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని హోం మంత్రి అనిత తెలిపారు.

# నేడు నర్సీపట్నంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి ,మహా :** ఈనెల 28వ తేదీన సోమవారం నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్ ) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు



సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావా లని సూచించారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడ యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమం కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజలు ఈ విషయాన్ని గమనించగలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆ ప్రకటనలో కోరారు.

## చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు

# మత్స్యకారుల పాలాభిషేకం

**విశాఖ ,మహా :** రాష్ట్ర మత్స్యకార కులాల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా, మత్స్యకార నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. శనివారం సాయంత్రం విశాఖపట్నం పౌరగ్రంథాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమం మత్స్యకార నేతల ఉత్సాహం నిలిచింది.జి.ఓ. నెం.217 రద్దు, జీవన భృతి రూ.20,000 పెంపు, ఆయిల్ సబ్సిడీ, వేట పరికరాల పంపిణీ వంటి పథకాల అమలుకు కృతజ్ఞతలు తెలుపుతూ మత్స్యకారులు కూటమి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మత్స్యకార కులాల అభివృద్ధికి మద్దతు కొనసాగించాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నడకుదిటి అర్జున్, ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు,



చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీజీ అప్పారావు, తెప్పల శాంతారామ్, కాటా గోపి, తుమ్మల రమేష్, మాతా గురునాథరావు, పుట్టా శివ, సాయి బలరాం, జీవి రమణారావు, అంగ కృష్ణ, పలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

పగడాల యాదయ్య సిపిఎం జిల్లా కార్యదర్శి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. ఆదివారం సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సమావేశం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో జరిగింది సమావేశానికి ముందు ఉగ్రవాదుల చేతుల్లో బలైన ప్రజలకు నివాళులర్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మర్చి కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఉగ్రదాడులను పసిగట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దేశంలోఇంత పెద్ద ఇంటలిజెన్స్ వ్యవస్థ సైనిక బలగాలను ఉంచుకొని కూడా ఉగ్రవాద చర్యలను పసిగట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజలు బలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కార్పొరేట్ పెట్టుబడుదారుల ప్రయోజనమే పరమావధిగా పనిచేస్తూ దేశంలోని కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగానే కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లను తీసుకొని వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం



లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఉచితాల పేరుతోటి ఊదరగొట్టి రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా మరిచిందని అన్నారు ఇప్పటికి రైతు భరోసా ఎక్కడ అందలేదని అర్హులైన వారికి రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు ఇంతవరకు ఇవ్వలేదని అన్నారు మరోవైపున రాష్ట్రంలోనీ ప్రభుత్వ భూములను అప్పనంగా వేలం వేస్తూ కార్పొరేట్ శక్తుల బొజ్జ నింపేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. స్థానికంగా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు శ్రేణులు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు.

## అభివృద్ధిని తన కుటుంబానికే పరిమితం చేసిన కేసీఆర్

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూది పాల బుచ్చి రెడ్డి

**శాయంపేట, మహా :** ఉద్యమ గొంతుకలని ఉలిగా మార్చి కుటుంబ రాజ్యమనే శిల్పాన్ని చెక్కిన ఆ పాతికేళ్ల పయనం రాష్ట్రం సాధించామనే ఆనందం తప్ప అన్ని వర్గాల ప్రజల ఆశలను వమ్ముచేసి అభివృద్ధిని ఒక కుటుంబానికే పరిమితం చేసి ఉద్యమకారుల కుటుంబాలను నిర్లక్ష్యం చేసి కొలువులన్ని ఒక కుటుంబానికి ఇచ్చి తెలంగాణ ప్రజలను ఉచితాలకై చేయి చాచే స్థితికి దిగజార్చిన పయనం బీఆర్ఎస్ దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చి రెడ్డి అన్నారు. ఆదివారం శాయంపేట మండల కేంద్రంలో మహా పత్రిక ప్రతినిధి తో ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవమే ధ్యేయంగా సాగిన ఉద్యమ ఆశయం టిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఆవిరైందన్నారు.తెలంగాణ సంపదను తన సొంత సంపదగా స్వాహా చేసి ప్రజలు ప్రశ్నించకుండా కుక్కకు బొక్క వేసినట్లు ఉచితాల ఊబిలో తెలంగాణ ప్రజలను దించిన దిక్కుమాలిన పయనం ఆ పాతికేళ్ల పయనమని అన్నారు. ఉద్యమ పార్టీ పక్తా రాజకీయ పార్టీ అయ్యి రంగులు మార్చిందని,పేరు మార్చిందని,రూటు మార్చిందని, చివరాకరికి ప్రజలను ఏమార్చిందన్నారు.అందుకే వారి దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ మాజీ సీఎం కేసీఆర్ అండ్ కోలను అధికారానికి దూరం చేసి అంతటితో బుద్ధి రాక పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నాకి పరిమితం చేసిందన్నారు. తెలంగాణ సమాజం ఎంత ప్రేమిస్తదో తేడా వస్తే అంతే ద్వేషిస్తుందని. అందుకు ఆ పాతికేళ్ల పయనం సాగించిన పార్టీకి ప్రజలు ఇచ్చిన గుండు సున్నానే సాక్ష్యమన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

## అఖిలపక్ష కార్మిక సంఘాల సదస్సు పిలుపు

**విశాఖ ,మహా :** లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ మే 20 న జరుగు అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి అని అఖిలపక్ష కార్మిక సంఘాల సదస్సు పిలుపు నిచ్చింది. దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ అనుసరిస్తున్నటువంటి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మరియు కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ మే 20వ తేదీ నాడు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అఖిలభారత సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సమ్మెను విశాఖలో జయప్రదంగా నిర్వహించేందుకు ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష కార్మిక,ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్. నర్సింగరావు, ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి ఆదినారాయణ సి ఎఫ్ టి యు ఐ జాతీయ అధ్యక్షులు ఎన్ కనకారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులు బ్రిటిష్ కాలం నుండే సాధించుకున్నటువంటి కార్మిక హక్కులను కాలరాచేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిందన్నారు .ఈ లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును, యాజమాన్యంతో జీతభత్యాలు బేరం ఆడుకోనే హక్కును కోల్పోతారన్నారు. యజమానికి నచ్చితే ఉద్యోగం నచ్చకపోతే తొలగించే విధంగా చట్టాల్లో మార్పు తీసుకొచ్చింద




న్నారు. కనీస వేతనాలు పిఎఫ్, ఈ ఎస్ ఐ, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యం లాంటివన్ని కోల్పోతారన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయన్నారు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ మే 20వ తేదీ నాడు దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక,ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఈ సమ్మెను బలపరుస్తూ హర్తాల్ కు పిలుపునిచ్చాయని తెలిపారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె జయప్రదం కోసం విస్తృతంగా కార్మిక వర్గంలోకి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు ఉన్నప్పుడే కార్మికులకు సక్రమమైనన్యాయం జరగడం లేదన్నారు. లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పరిశ్రమలో తనిఖీలను చేయడం లేదన్నారు. ప్రమాదాల జరిగి వందల మంది చనిపోతున్న లాభాలే పరమావధిగా యాజమాన్యాలు ఉంటున్నాయి తప్ప కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడం లేదన్నారు. మే 20 సమ్మె కార్మిక హక్కుల రక్షణ కోసం కార్మికుల భవిష్యత్తు కోసం జరుగుతున్న సమ్మెని ఈ సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి నాగభూషణం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం మన్మధరావు వ్యవహరించారు. ఈ సమావేశంలో పబ్లిక్ సెక్టర్ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కే యం శ్రీనివాస్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ p. మణి, ఐఎన్టీయూసీ నాయకులు రామచందర్రావు, ఏపీ ఎఫ్ టి యు నాయకులు దేవా, సి ఎఫ్ టి యు ఐ నాయకురాలు లక్ష్మీ, లతోపాటు వివిధ పరిశ్రమలు రంగాలు యూనియన్స్ నుంచి పెద్ద ఎత్తున కార్మికులు హాజరయ్యారు. సదస్సు లో అఖిలపక్ష కార్మిక సంఘాల తరపున లేబర్ కోడ్స్ రద్దు చేయాలని మే 20న జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులందరూ దీనిపై మాట్లాడి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సదస్సుకు ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్కే రెహమాన్ ఆహ్వానం పలకగా ఐ ఎన్ టి సి జిల్లా నాయకులు కొండబాబు వందన సమర్పణ చేశారు.



## ఉగ్రవాదుల దాడి ఘటనతో అప్రమత్తమైన జిల్లా పోలీసులు

జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్

**అనకాపల్లి జిల్లా,యలమంచిలి, మహా :** జమ్ము కాశ్మీర్ ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పహల్గాం లో పాక్ ఉగ్రవాదులు చేసిన దాడి నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రికార్డులు లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. డిజిపి హరీష్ గుప్తా ఆదేశాలతో జిల్లా ఎస్పీ నేతృత్వంలో ఎలమంచిలి జాతీయ రహదారిపై అనుమానస్పద వ్యక్తులు పై నిఘా తో పాటు రికార్డులు తనిఖీలు ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ నేత్రత్వంలో చేపట్టారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, ప్రముఖ హోటల్లు బస్టాండ్ లు, చెక్ పోస్ట్ పాయింట్లు వద్ద నిఘా ఏర్పాటు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పహల్గాం దాడి నేపథ్యంలో ప్రత్యేక భద్రత చర్యలు చేపడుతున్నట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ వివరించారు.

## తాళ్ల పద్మావతి కళాశాలలో ఘనంగా 17వ వార్షికోత్సవ వేడుకలు

తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ తాళ్ల మల్లేష్ జ్యోతి

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం లోని సోమిడి గ్రామంలో గల తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో 17వ వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ప్రతి ఏటా కళాశాలలో జరిగే వార్షికోత్సవ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, వెస్ట్రన్ కల్చర్ ప్రోగ్రామ్స్, తెలంగాణ సాంప్రదాయ నృత్యాలు, సమాజాన్ని మేలుకొలిపే విధంగా విద్యార్థులు ప్రదర్శించే నాటికలతో వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుతామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వేలు అన్నారు.. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా మొదటగా తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ తాళ్ల మల్లేష్ జ్యోతి.. ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫోక్ సింగర్ వరం, రాము హాజరయ్యి వారి ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ ఆర్ డాక్టర్ వేలు మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా జరుపుకుంటామని అన్నారు. ఈ వార్షికోత్సవానికి తెలంగాణ ఫోక్ సింగర్స్ ని పిలిచామని మా కళాశాల లో ప్లేస్మెంట్స్ జరిపామని అన్నారు. అదేవిధంగా వైస్ ప్రిన్సిపాల్ వి



జయలక్ష్మి మాట్లాడుతూ కాలేజీలో ప్రతి ఒక్క విద్యార్థి పట్ల మానవత విలువలతో కూడుకున్నటువంటి విద్యను నేర్పిస్తూ ఉంటామని ప్రతిరోజు స్వయంగా పిల్లలని పర్యవేక్షిస్తామని వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి అహర్నిశలు కృషి చేస్తామని ఎందుకు మాతోపాటు కాలేజీ యజమాన్యం ముందుంటుందని అన్నారు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ శిల్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఈసారి తెలంగాణ ఫోక్ సింగర్స్ వరం, రాము లను ముఖ్య అతిథులుగా పిలవడం కూడా విద్యార్థులు అంతా చాలా సంతోషంగా ఉన్నారని నా సేవలు కాలేజీ యజమాన్యానికి విద్యార్థుల ఎదుగుదలలో ఎప్పుడు తోడుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి తెలంగాణ పర్యటన

హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలతో మర్యాద పూర్వక భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 27:మహా:** జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీమతి శిల్పి నేహా తెర్కే ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర రావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధి, సమగ్ర సాగు విధానాలు, పంట విభజన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అనేక అంశాలపై చర్చ జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ రంగంలో అనుభవాలను పంచుకోవాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు నిర్ణయించారు. శిల్పి నేహా తెర్కే గారు ఈ నెల 30వ తేదీ వరకు తెలంగాణలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నేషనల్ మిలెట్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ , ఫిష్ ఫార్మింగ్ కేంద్రం, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలెట్స్ రీసెర్చ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను సందర్శించనున్నారు. ఈ సంస్థలచే చేపడుతున్న పరిశోధనలపై అవగాహన సాధించనున్న ఆమె, ఆయా రంగాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను తమ రాష్ట్రంలో కూడా అందు



బాటులోకి తేనున్న దిశగా చర్చలు జరపనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు ఐఏఎస్ , ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ పాషా ఐఏఎస్ తదితర అధికారులు కూడా పాల్గొన్నారు. విభిన్న శాఖల అధికారులు తమ అనుభవాలను షేర్ చేస్తూ, వ్యవసాయ రంగ బలోపేతానికి అవసరమైన అంశాలను వివరించారు. ఈ పర్యటన ద్వారా జార్ఖండ్-తెలంగాణ వ్యవసాయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని, రాష్ట్రాల అభివృద్ధికి ఇది సహాయపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఈడీ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం

**ముంబై:** దక్షిణ ముంబైలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బాలార్డ్ ఎస్టేట్ ప్రాంతంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం ఖైసర్ ఏ హిందు భవనంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే, ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ భారీ అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాక సిబ్బంది 12 ఫైరింజన్లతో మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశాయి. ఆదివారం తెల్లవారు జామన ఈడీ ఆఫీస్‌లో ప్రమాదం జరగడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. పీటీఐ కథనం ప్రకారం.. కారింభోయ్ రోడ్డుపై ఉన్న గ్రాండ్ హోటల్ సమీపంలోని కైసర్ ఐ హింద్ అనే భవనంలో ఆదివారం ఉదయం 2:31 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగినట్లు ఫైర్ బ్రిగేడ్‌కు సమాచారం అందింది. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ బ్రిగేడ్ బృందాలు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నాయి. మొదట మామూలు మంటగా కనిపించినా, ఉదయం 3:30 గంటల సమయంలో మంటలు తీవ్రంగా మారడంతో దాన్ని లెవల్ 2 (భారీ



అగ్ని ప్రమాదం) గుర్తించారు. ఇక ఈ భవనంలోని నాలుగు,ఐదు అంతస్తులలో అగ్ని ప్రమాదం జరిగినట్లు మున్సిపల్ అధికారి తెలిపారు. ఘటన స్థలానికి 12 ఫైరింజన్లు, ఆరు జంబో వాటర్ ట్యాంకర్లు, ఒక ఎరియల్ వాటర్ టవర్ టెండర్, ఒక బ్రెతింగ్ అపారాటస్ వాన్, రెస్క్యూ వాన్, క్విక్ రెస్పాన్స్ వాహనం, అలాగే అంబులెన్స్ సైతం అందుబాటులో ఉంచారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని అధికారులు తెలిపారు.

# పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసిందే కాంగ్రెస్ పార్టీ

రాజ్యాంగాన్ని మనమందరం పరిరక్షించుకోవాలి

బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాన్ని మానుకోవాలి

బీఆర్ఎస్ ప్రజల సొమ్ముతో రజతోత్సవం జరుపుతుంది

కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఏఐసీసీ పీసీసీ పిలుపు మేరకు మన కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచన మేరకు ఆదివారం కల్వకుర్తి మండల పరిధిలోని బెక్కర గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "జై బాపు జై భీమ్ జై సంవిధాన్" కార్యక్రమా ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణ మరియు మహాత్మ గాంధీ శాంతి సందేశం గడప గడపకు వెళ్ళి వివరించారు. మండల నాయకులు, గ్రామంలోని కార్యకర్తలతో కలిసి డాక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పట్టుకొని గ్రామంలో ప్రతి గడప గడపకు వెళ్ళి కరపత్రాలు పంచుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఏ విధంగా అణిచి వేస్తుందో తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా జరగని బీసీ కుల గణన, అలాగే ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మన కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అదే విధంగా పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న రాష్ట్రం, దేశం లోనే మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఎన్నికలలో చెప్పిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గడపగడపకు తిరిగి చెప్పడం జరిగింది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి కోట్లాది రూపాయలు అక్రమార్జనతో సంపాదించిన డబ్బుతో బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవాల



పేరుతో జరిగే సభకు ప్రజలకు డబ్బులు ఇచ్చి తరలిస్తున్నారు. పేదల సంక్షేమానికి పాటు పడే కాంగ్రెస్ 6 గ్యారంటీలు ఆర్థిక పరిస్తితి రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న, ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు విశిష్టంగా కృషి చేస్తుంది. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని మాయమాటలు చెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అండగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు బాల్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లెపల్లి జగన్, కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షులు దళపతి గౌడ్, యువజన కాంగ్రెస్ కల్వకుర్తి మండల అధ్యక్షులు బీసబాల్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మావిళ్ళ పల్లి వంశీ, భరత్ రెడ్డి, బండి సుదర్శన్, గ్రామస్తులు నారాయణ రెడ్డి, కృష్ణ రెడ్డి, అర్జున్, శివా రెడ్డి, భగవంతు, వెంకట్ రెడ్డి, పరిశరాములు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ దెబ్బ అదుర్స్..

## పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎమర్జెన్సీ!

దాయాది దేశం పాకిస్తాన్‌కు భారత్ 'జీలం ఝలక్' ఇచ్చింది. ముస్ముందు సినిమా ఎలా ఉంటుందో తెలిపేలా ఓ ట్రైలర్ చూపించింది. పాకిస్థాన్ అధికార వర్గాలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా భారత్ శనివారం హఠాత్తుగా జీలం నదిలోకి నీటిని విడుదల చేసింది. దీంతో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) రాజధాని ముజఫరాబాద్ వద్ద ఒక్కసారిగా నదిలో నీటి మట్టం పెరిగి వరద పోటెత్తింది. నది పొంగి పొర్లుతుండటంతో హతియన్ బాలా వద్ద 'నీటి అత్యయిక పరిస్థితి' (ఎమర్జెన్సీ) ప్రకటించారు. హతియన్ బాలా ప్రాంతం ముజాఫరాబాద్ నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో జీలం ఒడ్డున ఉంటుంది. నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో ఉందంటూ స్థానిక మసీదుల్లోని మైకుల ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఘరీ దుపట్టా, మజ్హాయ్ వంటి జీలం నది ఒడ్డు ప్రాంతాల గ్రామాల్లో నివసించే ప్రజలు అకస్మాత్తుగా నీటిమట్టం పెరగడంతో భీతి చెందారు. మన కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్లోని చకోతీ ప్రాంతం గుండా ప్రవహిస్తూ నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. 20 నుంచి 30 అడుగుల ఎత్తున నీళ్లు ప్రవహిస్తున్నాయని,1990 దశకం తర్వాత ఈ స్థాయిలో వరద రావడం ఇదే మొదటిసారని స్థానికులు చెబుతున్నారు. కాగా, భారత్ చర్య అంతర్జాతీయ నిబంధనలను, జల ఒప్పందాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని పాక్ ఆరోపించింది. ఈ ఘటనపై భారత్ వైపు నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం విశేషం!. దీనివల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

**అయితే కరువు... లేకపోతే వరద!**

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి తర్వాత సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన



సంగతి తెలిసిందే. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు విడనాడే వరకు ఒప్పందం అమలు సస్పెన్షన్లో ఉంటుందని భారత ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో భారత్, పాక్ నడుమ సింధు నదీ జలాల ఒప్పందం కుదిరింది. పాకిస్థాన్లో 90% సేద్యం సింధు జలాలపై ఆధారపడుతుంది. హైడ్రలాజికల్ డేటాను ఎప్పటికప్పుడు సరైన సమయంలో పాకిస్తాన్‌కు అందజేయాలనేది ఈ ఒప్పందంలో మన దేశం నెరవేర్చాల్సిన ఓ కీలక బాధ్యత. వరద హెచ్చరికలను ముందుగానే తెలియజేయడం, నీటి వినియోగ వివరాలు, హిమనీనదాలు (గ్లేసియర్స్) కరిగే తీరుతెన్నుల సమాచారాన్ని పొరుగుదేశంతో పంచుకోవడం భారత్ విధి. ఒప్పందం అమలును భారత్ తాజాగా నిలిపివేయడంతో ఇప్పుడిక ఈ బాధ్యతలకు బ్రేక్ పడింది. సింధు నది, దాని ఉపనదుల్లో ఏయే సమయాల్లో ఏమేరకు నీటి నిల్వలున్నాయనే సమాచారాన్ని భారత్ ఇవ్వకపోతే పాక్ పరిస్థితి... నీరు లేక నేల ఎండిపోయి... 'పడితే కరువు బారిన పడటం లేదంటే వరద ముంచెత్తడం' అన్నట్టు తయారవుతుంది.



## ప్రపంచంలోని 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు: లేటెస్ట్ రిపోర్ట్

భారత ఆర్థిక వ్యవస్థ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇండియా.. జర్మనీ, జపాన్‌లను అధిగమించి ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని పలువురు నిపుణులు చెబుతూనే ఉన్నారు. భారతదేశం ప్రపంచానికి విద్యా కేంద్రంగా మారగలదని, మిగతావన్నీ పక్కన పెడితే మన దేశంలోని ప్రజాస్వామ్యమే మనకు అతిపెద్ద ప్రయోజనమని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం తన అభిప్రాయాన్ని ఇటీవలే వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదవ అతిపెద్దది. వచ్చే ఏడాది చివరి నాటికి మనం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండబోతున్నాము. ఆ తర్వాత ఏడాది మూడవ అతిపెద్దదిగా ఉంటామని ఆయన వివరించారు. ప్రపంచంలోని టాప్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ GDPకి గణనీయంగా దోహదపడతాయి. అంతే కాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక విధానాలపై కూడా బలమైన ప్రభావాన్ని చూపుతాయి. వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదిక ప్రకారం.. టాప్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ఇలా..


- **యునైటెడ్ స్టేట్స్ (యూఎస్):** 30.507 ట్రిలియన్ డాలర్లు
- **చైనా:** 19.231 ట్రిలియన్ డాలర్లు
- **జర్మనీ:** 4.744 ట్రిలియన్ డాలర్లు
- **భారతదేశం:** 4.187 ట్రిలియన్ డాలర్లు
- **జపాన్:** 4.186 ట్రిలియన్ డాలర్లు
- **యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే):** 3.839 ట్రిలియన్ డాలర్లు
- **ఫ్రాన్స్:** 3.211 ట్రిలియన్ డాలర్లు
- **ఇటలీ:** 2.422 ట్రిలియన్ డాలర్లు
- **కెనడా:** 2.225 ట్రిలియన్ డాలర్లు
- **బ్రెజిల్:** 2.125 ట్రిలియన్ డాలర్లు



## నిరాశపరిచిన ఎస్‌బీఐ కార్డ్

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ కార్డ్ (క్రెడిట్ కార్డు సేవల్లోని) గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (2025 జనవరి-మార్చి) రూ.534 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.662 కోట్లతో పోల్చి చూస్తే 19 శాతం తగ్గిపోయింది. క్రెడిట్ కార్డులపై రుణ ఎగవేతలు పెరగడం లాభాలకు గండికొట్టింది. మొత్తం ఆదాయం మాత్రం ఇదే కాలంలో రూ.4,475 కోట్ల నుంచి రూ.4,832 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.2,415 కోట్లకు మెరుగుపడింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,139 కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక రుణాలు (వసూలు కాని/ ఎన్‌పీఏలు) మొత్తం రుణాల్లో 3.08 శాతంగా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 2.76 శాతమే. నికర ఎన్‌పీఏలు గమనించినా.. 0.99 శాతం నుంచి 1.46 శాతానికి పెరిగాయి. నష్టాలు/మొండి బకాయిలకు కేటాయింపులు క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.944 కోట్లుగా ఉంటే, సమీక్షా కాలంలో రూ.1,245 కోట్లకు పెరిగిపోయాయి. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ కార్డ్ రూ.1,916 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2023-24లో నమోదైన రూ.2,408 కోట్లతో పోల్చి చూస్తే 20 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.17,484 కోట్ల నుంచి రూ.18,637 కోట్లకు వృద్ధి చెందింది. బ్యాలన్స్ షీట్ విలువ రూ.58,171 కోట్ల నుంచి రూ.65,546 కోట్లకు పెరిగింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ షేరు ధర ఒక శాతానికి పైగా లాభపడి రూ.927 వద్ద ముగిసింది.

## ఏఐ జాబ్ మార్కెట్ బూమ్.. టాప్ 10 స్కిల్స్ ఇవే..




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఉద్యోగ మార్కెట్ అనూహ్యమైన వృద్ధిని సాధిస్తోంది. యునైటెడ్ స్టేట్స్‌లో 2024లో ఏఐ జాబ్ పోస్టింగ్‌లలో 20% పెరుగుదల నమోదైందని లైట్‌కాస్ట్ నిర్వహించిన 2025 AI ఇండెక్స్ రిపోర్ట్ తెలిపింది. 109 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులతో ఊపందుకున్న ఈ మార్కెట్, ప్రత్యేక ఏఐ నైపుణ్యాల డిమాండ్‌ను పెంచుతూ ఉద్యోగ రంగాన్ని పునర్నిర్మిస్తోంది. పైథాన్ అత్యంత డిమాండ్ ఉన్న నైపుణ్యంగా నిలిచింది. గత సంవత్సరం దాదాపు 200,000 ఉద్యోగ పోస్టింగ్‌లలో ఈ నైపుణ్యాన్ని అడిగారు. రిపోర్ట్ ప్రకారం.. పైథాన్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌తోపాటు అధిక డిమాండ్ ఉన్న టాప్ 10 ఏఐ ఉద్యోగ నైపుణ్యాలు ఇవే..

- పైథాన్ (199,213 పోస్టింగ్‌లు, 2012 2014తో పోలిస్తే 527% వృద్ధి)
- కంప్యూటర్ సైన్స్ (193,341 పోస్టింగ్‌లు, 131% వృద్ధి)
- డేటా అనాలిసిస్ (128,938 పోస్టింగ్‌లు, 208% వృద్ధి)
- SQL (119,441 పోస్టింగ్‌లు, 133% వృద్ధి)
- డేటా సైన్స్ (110,620 పోస్టింగ్‌లు, 833% వృద్ధి)
- ఆటోమేషన్ (102,210 పోస్టింగ్‌లు, 361% వృద్ధి)
- ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ (101,127 పోస్టింగ్‌లు, 87% వృద్ధి)
- అమెజాన్ వెబ్ సర్వీసెస్ (100,881 పోస్టింగ్‌లు, 1,778% వృద్ధి)
- అజైల్ మెథడాలజీ (88,141 పోస్టింగ్‌లు, 334% వృద్ధి)
- స్కేలబిలిటీ (86,990 పోస్టింగ్‌లు, 337% వృద్ధి)

**కింగ్ 'పైథాన్'**

పైథాన్ బహుముఖ ప్రజ్ఞ, విస్తృత లైబ్రరీలు దీనిని ఏఐ అభివృద్ధిలో కీలకమైన అంశంగా మార్చాయని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో డేటా సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమిలీ చెన్ అన్నారు. "మెషిన్ లెర్నింగ్ నుండి ఆటోమేషన్ వరకు, పైథాన్ అనివార్యం" ఆమె తెలిపారు. డేటా సైన్స్ (833% వృద్ధి), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (1,778% వృద్ధి) వంటి నైపుణ్యాలు అత్యధిక వృద్ధిని సాధించాయి, ఇవి సంక్లిష్ట డేటాసెట్‌ల నుండి సమాచారాన్ని సంగ్రహించే, స్కేలబుల్ ఏఐ సిస్టమ్‌లను నిర్మించే నైపుణ్యాల అవసరాన్ని సూచిస్తున్నాయి. అజైల్ మెథడాలజీ (88,141 పోస్టింగ్‌లు) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఇటరేటివ్ విధానాలకు ఉన్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది. ఈ డిమాండ్ విస్తరణ టెక్ దిగ్గజ కంపెనీల నుండి స్టార్టప్‌ల వరకు వివిధ రంగాలలో అవకాశాలను సృష్టిస్తోంది.

## అలాంటి బ్యాంక్ అకౌంట్స్ వెంటనే క్లోజ్ చేసుకోండి

సాధారణంగా చాలా మందికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ అకౌంట్స్ ఉంటాయి. అయితే.. అందులో ఒకటి లేదా రెండు మాత్రమే ఉపయోగిస్తుంటారు. మిగిలినవన్నీ వృథా అన్న మాట. ఇలా వదిలేయడం వల్ల.. కొన్ని నష్టాలు భరించాల్సి ఉంటుంది. ఈ కథనంలో అలాంటి నష్టాలేమిటో తెలుసుకుందాం..

**బ్యాంక్ చార్జీలు**

ఒక బ్యాంకులో అకౌంట్ ఉందంటే.. అందులో మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ చేయాల్సిందే. ఒకవేళ మినిమమ్ బ్యాలెన్స్ లేకుండా ఉంటే.. వాటిపై బ్యాంక్ చార్జీలు వసూలు చేస్తుంది. కొన్నిసార్లు మైనస్ బ్యాలెన్స్‌లోకి కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. ఆ తరువాత లావాదేవీలు చేయాలంటే.. ముందు మైనస్ బ్యాలెన్స్ క్లియర్ చేయాల్సిందే.

**డబ్బు వృథా**

బ్యాంక్ అకౌంట్ ఉపయోగించకుండా.. అలాగే వదిలేస్తే అందులో ఉన్న మినిమమ్ బ్యాలెన్స్ వంటివి వృథా అవుతాయి. మీకు ఓ ఐదు అకౌంట్స్ ఉన్నాయనుకుంటే.. అందులో మీరు కేవలం ఒకదాన్ని మాత్రం వాడుతూ.. మిగిలినవి ఉపయోగించకుండా వదిలేస్తే అందులో ఉన్న డబ్బు వృథా అయినట్టే. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఎక్కువ అకౌంట్స్ మెయింటెన్సన్ చేయకుండా ఉండటమే ఉత్తమం.


**మోసాలకు అవకాశం**

టెక్నాలజీ పెరుగుతున్న సమయంలో మోసాలు ఎక్కువవుతున్నాయి. మీరు ఉపయోగించకుండా ఉంటే.. అలాంటి అకౌంట్లను కొందరు సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఇవి మిమ్మల్ని చిక్కుల్లో పడేసే అవకాశం ఉంది. కాబట్టి బ్యాంక్ అకౌంట్ వృధాగా ఉన్నా.. అప్పుడప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి. లేదా క్లోజ్ చేసుకోవడం మంచిది.

**సిబిల్ స్కోరుపై ప్రభావం**

బ్యాంక్ అకౌంట్ యాక్టివ్‌గా లేకుంటే.. మైనస్ బ్యాలెన్స్‌లోకి వెళ్ళిపోతుంది. అంటే దీనర్థం మీరు బ్యాంకుకు అప్పు ఉన్నారన్నమాట. ఇది మీ క్రెడిట్ స్కోర్ మీద ప్రభావం చూపిస్తుంది. దీంతో సిబల్ స్కోర్ తగ్గిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే.. యాక్టివ్‌గా ఉన్న అకౌంట్స్ కాకుండా.. మిగిలినవన్నీ వెంటనే క్లోజ్ చేసుకోవాలి.



# దేశం-విదేశం
NATIONAL-INTERNATIONAL





## ముగిసిన ఇరాన్, అమెరికా మూడో దఫా చర్చలు



**మస్కట్ (ఒమన్):** యురేనియం శుద్ధి కార్యక్రమం వేగాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఇరాన్‌తో అమెరికా చేపట్టిన మూడో దఫా పరోక్ష చర్చలు శనివారం ఒమన్‌లో ముగిశాయి. అయితే ఈ చర్చల్లో ఎలాంటి సానుకూల ఫలితాలు వచ్చాయి అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. చర్చల తర్వాత అమెరికా తరపున అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలు ఒమన్ నుంచి తమ స్వదేశాలకు పయనమయ్యారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. "పరస్పర గౌరవం, హామీలకు కట్టుబడేలా ఒప్పందం కుదర్చుకునేందుకు రెండు దేశాలు ఆసక్తి కనబర్చాయి. కీలక ప్రతిపాదనలు, సాంకేతిక అభ్యంతరాలు, తదితరాలపై మరోదఫా చర్చలు జరుపుతాం. వచ్చే వారం సైతం సంప్రతింపుల ప్రక్రియ కొనసాగుతుంది. మళ్లీ అత్యున్నత స్థాయి సమావేశం జరుగుతుంది. మే మూడో తేదీన తదుపరి భేటీ ఉంటుంది"అని ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్ బుసైదీ ప్రకటించారు. గతంలో మస్కట్, రోమ్‌లో ఇలా పరోక్ష చర్చలు జరిగాయి. గతంలో మాదిరే ఈసారి చర్చల్లో సైతం ఒమన్ విదేశాంగ మంత్రి బుసైదీ మధ్యవర్తిగా ఉన్న విషయం విదితమే. చర్చలకు ముందు విట్కాఫ్ రష్యాలో ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. చర్చలు మొదలైన సమయంలోనే దక్షిణ ఇరాన్‌లో రజేయీ నౌకాశ్రయంలో శనివారం పేలుళ్లు సంభవించడం గమనార్హం. అర్ధశతాబ్ద శత్రుత్వాన్ని పక్కనబెట్టిమరీ ఇరాన్‌పై కఠిన ఆంక్షలను సడలిస్తామని, అందుకు ప్రతిగా అణ్వాయుధంలో ఉపయోగించే యురేనియం శుద్ధి వేగాన్ని తగ్గించాలని అమెరికా డిమాండ్ చేయడం తెల్సిందే. తమ డిమాండ్లను ఒప్పుకోకుంటే దాడులతో తెగబడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. అయితే అందుకు దీటుగా బదులిస్తామని ఇరాన్ ప్రతిస్పందించడం విదితమే.

## ట్రంప్, జెలెన్‌స్కీ ఏకాంత చర్చలు


**కీవ్:** పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వాటికన్ సిటీకి వెళ్లిన అమెరికా అధ్యక్షుడు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అక్కడే భేటీ అయ్యారు. అంత్యక్రియల కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముందుగా వీరిద్దరూ సెయింట్ పీటర్స్ బసిలికాలో 15 నిమిషాలు మాట్లాడుకున్నారు. ప్రైవేట్‌గా సమావేశమైన ఇద్దరు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు జరిగాయని వైట్‌హౌస్ కూడా తెలిపింది. ఇతర వివరాలను తర్వాత వెల్లడిస్తామని పేర్కొంది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలికేలా అత్యున్నత స్థాయి సమావేశం త్వరలోనే జరగనుందని అంతకు ముందు రోమ్ చేరుకున్న ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'పుతిన్, జెలెన్‌స్కీ ఒప్పందానికి అతి సమీపంలో ఉన్నారు. యుద్ధం ముగింపునకు రావాలంటే వీరి సమావేశం జరగాలి. చాలా ముఖ్యమైన అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. ఇప్పుడే ఈ రక్తపాతాన్ని ఆపాలి. క్రూరమైన, అర్థరహితమైన ఈ యుద్ధానికి ముగింపు పలుకుతాం'అని శుక్రవారం ఒక ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. క్రిమియా రష్యాతోనే ఉంటుందని ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్ శుక్రవారం మాస్కోలో పుతిన్‌తో సమావేశమవడం తెల్సిందే. వాటికన్‌లో ట్రంప్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ సైతం సోషల్ మీడియాలో స్పందించారు. 'ఒక్కో అంశాన్ని సవివరంగా చర్చించాం.

వీటిపై సానుకూల ఫలితాలను ఆశిస్తున్నాం. ప్రజల ప్రాణాలను కాపాడుకోవడం, సంపూర్ణ, భేషరతు కాల్పుల విరమణ, మళ్లీ యుద్ధం రాకుండా నివారించే విశ్వసనీయమైన, శాశ్వత శాంతి మాకు కావాలి'అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అత్యంత కీలకమైన సమావేశాలు జరగనున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరగనున్న భేటీపై ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఇది చారిత్రాత్మకంగా మారే అవకాశం ఉందన్నారు.

అయితే, భేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించేలా రష్యాపై తక్షణమే ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. శనివారం మరోసారి చర్చలు కొనసాగించాలని ట్రంప్, జెలెన్‌స్కీ నిర్ణయించుకున్నారని ఉక్రెయిన్ అధ్యక్షభవనం ప్రతినిధి సెర్హి నికిఫొరోవ్ అంతకుముందు వెల్లడించారు. కానీ, పోప్ అంత్యక్రియలు ముగిసిన వెంటనే ట్రంప్ నేరుగా రోమ్ విమానాశ్రయం చేరుకుని, ఎయిర్ ఫోర్స్ విమానంలో అమెరికాకు బయలుదేరారు. దీంతో, రెండో సమావేశానికి అవకాశం లేకుండా పోయింది.

## సరిహద్దుల్లో టెన్షన్..
### విధ్వంసక క్షిపణి పరీక్ష చేపట్టిన భారత్

**ఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. భారత సరిహద్దుల్లో పాక్ ఆర్మీ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ కాల్పులు జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. వివరాల ప్రకారం.. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భారత నౌకాదళం సిద్ధమవుతోంది. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా.. ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ సిద్ధమని ప్రకటించింది. ఈ మేరకు క్షిపణి పరీక్షలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే, మూడు రోజుల క్రితమే భారత్ ఇదే సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎంఆర్ఎస్ఏఎం)తో సీ స్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న



లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పేర్కొంటారు.

### భారత్‌పై దాడి కోసం
## 130 అణు బాంబులు
### పాక్ మంత్రి సంచలన వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగంగా బెదిరింపులకు దిగాడు. భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్తాన్ 130కి పైగా అణు ఆయుధాలతో పాటు ఘోరి, షాహీన్, ఘుజ్నవి మిసైళ్ళను సిద్ధం చేసినట్లు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. రాక్షసత్వానికి పరాకాష్ఠగా నిలిచిన పహల్గాం ఉగ్రదాడిపై రగిలిపోతున్న భారత్ తన చర్యల ద్వారా దాయాదిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సింధూ నదీ జలాల నిలిపివేత, పాకిస్తాన్ జాతీయుల వీసాలు రద్దు, ఇతర వాణిజ్య సంబంధాలను నిలిపివేసింది. దీంతో ఏం చేయాలో పాలుపోక దీనంగా చూస్తోంది. ఈ క్రమంలో హనీఫ్ అబ్బాసీ భారత్‌ను కవ్వించే ప్రయత్నం చేశారు. భారత్ ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తే యుద్ధానికి సిద్దంగా ఉండాలని హెచ్చరించారు. యుద్ధం చేసేందుకు తాము సన్నంద్ధంగా ఉన్నామని, దేశవ్యాప్తంగా అణు ఆయుధాల్ని సిద్ధం చేశామన్నారు. ఆ అణు ఆయుధాలు ప్రదర్శన కోసం కాదని, భారత్‌పై దాడి చేసేందుకేనని చెప్పారు. స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. 'నీటి సరఫరాను ఆపితే మనతో యుద్ధం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి. మన వద్ద ఉన్న సైనిక పరికరాలు, మిసైళ్ళు ప్రదర్శన కోసం కాదు. మన అణు ఆయుధాలు ఎక్కడ ఉన్నాయో ఎవరికీ



తెలియదు. నేను మళ్లీ చెబుతున్నాను, ఈ బాలిస్టిక్ మిసైళ్ళు, అవన్నీ భారత్‌పై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అంతకుముందు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశం గత మూడు దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థల్ని పెంచి పోషించిందని ఒప్పుకున్నారు. దాని ఫలితమే ఈ దుర్భర పరిస్థితులకు కారణమని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.





# ఐటమ్ సాంగ్స్‌లో స్టార్ హీరోయిన్లు..

## అత్యధిక రెమ్యునరేషన్ ఎవరికంటే..?

పాటలు నృత్యాలు. అలాగే డ్యాన్స్ నంబర్‌లు 30వ దశకంలో టాకీల రోజుల నుంచే భారతీయ చలనచిత్రంలో భాగమయ్యాయి . వ్యాంప్ కేరెక్టర్లకు పరిమితమైన వారు మాత్రమే కాకుండా ఏకంగా హీరోయిన్లు ఈ తరహా నృత్యాలు చేయడం మొదలు పెట్టిన దగ్గర నుంచి వీటిని కాస్త హుందాగా ఐటెమ్/స్పెషల్ సాంగ్స్ లేదా ప్రత్యేక నృత్యాలుగా పిలుస్తున్నారు. ప్రస్తుతం ఈ ఐటెం సాంగ్(Item Song)లు సినిమాల విజయాలకు చాలా కీలకమైనవిగా మారాయి. దాంతో పాటే ఈ తరహా నృత్యాల కోసం డ్యాన్సర్లు, హీరోయిన్లు వసూలు చేసే రెమ్యూనరేషన్ కూడా ఆకాశాన్ని అంటింది. బాలీవుడ్‌కి చెందిన నోరా ఫతేహి వంటి ప్రముఖ డ్యాన్సర్లు ఒక్కో పాటకు 2 కోట్ల రూపాయల చొప్పున, సన్నీ లియోన్ కూడా అంతే మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గబ్బర్ సింగ్‌లో కెవ్వు కేక అంటూ కేక పెట్టించిన మలైకా అరోరా పాటకు రూ. 50 లక్షల నుంచి 1కోటి వరకు వసూలు చేస్తూ ఇప్పుడు కాస్త వెనకడుగులో ఉంది. ప్రముఖ నటీమణులు ఈ డ్యాన్స్ నంబర్‌లకు వసూలు చేస్తున్న మొత్తాలు వారి డ్యాన్స్ సామర్థ్యాల కంటే చాలా ఎక్కువ అనేది వాస్తవం. అయితే డ్యాన్స్ ప్రతిభ కన్నా తమ స్టార్ పవర్‌ను వీరు ఎక్కువగా ఉపయోగించుకుంటూ ఎక్కువ మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారు. కరీనా కపూర్ ఐటెం సాంగ్ చేసేటప్పుడు రూ. 1.5 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసేదట. , కత్రినా కైఫ్ ఒక్కో పాటకు 2 కోట్ల రూపాయలకు పైగా అందుకుందట. ఈ తరహా పాటలకు పేరొంది అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణులలో ఒకరైన జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ప్రతి పాటకు రూ. 3 కోట్లు తీసుకుంటుంది. దబిడి దిబిడి భామ ఊర్వశి రౌతాలా కూడా అంతే మొత్తం అడిగేది..ఇప్పుడు మరింత ఎక్కువ డిమాండ్ చేస్తోంది. సినీ పండితుల సమాచారం ప్రకారం, తమన్నా భాటియా, జాన్వీ కపూర్, పూజా హెగ్డే, తాప్సీ పన్ను వంటి వారు ఇప్పుడు ఐటమ్ నెంబర్స్‌లో డిమాండ్‌లో ఉన్నారు. ఈ కోవలో నిన్నా మొన్నటి దాకా అత్యధిక పారితోషికం అందుకున్న రికార్డ్ నటి సమంత పేరిట ఉంది. ఆమె పుష్ప ది రైజ్‌లో ఊ అంటావా పాట కోసం అత్యధిక మొత్తం వసూలు చేసినట్లు సమాచారం. ఒక సినిమాలో ఒక్క ఐటమ్ సాంగ్ చేయడం ద్వారా ఆ సినిమా మొత్తం కనిపించిన హీరోయిన్ కన్నా ఎక్కువ మొత్తం అందుకుందీమె. పుష్పలో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న మొత్తం సినిమాకి కేవలం రూ. 2 కోట్లు మాత్రమే తీసుకుంటే. అయితే ఊ అంటావా పాట కోసం సమంత రూ. 5 కోట్ల పారితోషికాన్ని రాబట్టిందట. ఇటీవలి కాలంలో తమన్నా ఐటమ్ ట్రెండ్స్‌లోకి అనూహ్యంగా దూసుకొచ్చింది. తెలుగులో స్వింగ్ జర స్వింగ్ జర అంటూ జూనియర్ ఎన్టీయార్ పక్కన మెలికలు తిరిగిన ఈ మిల్కీ బ్యూటీ అలా మొదట్లో రూ.కోటిలోపే తీసుకుంటూ అప్పుడప్పుడు ఐటమ్‌గాళ్ గా కనిపించినా...ఇప్పుడు స్పెషల్ సాంగ్ అంటే తానే గుర్తొచ్చేంతగా ఎదిగిపోయింది. దీనికి వరుసగా ఆమె ఐటమ్ సాంగ్స్ హిట్ కావడమే కారణం. రూ.3కోట్లు తీసుకుని జైలర్ లో 'నువ్వు కావాలయ్యా..దా' పాటలో ఊపేసిన తమన్నా సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్ వీడియోలకు బోలెడంత ఫీడ్ అందించింది. ఆ తర్వాత బాలీవుడ్ సినిమా స్త్రీ 2 ఆమెని మరింత అందనంత ఎత్తుకి తీసుకెళ్లింది. ఆ సినిమాలోని ఆజ్‌కి రాత్... పాట ఉత్తరాది ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకోవడంతో తాజాగా రైడ్ 2లో చేసిన ఐటమ్ సాంగ్ కోసం రూ.5కోట్లు తీసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం ఐటమ్ సాంగ్స్ చేసే హీరోయిన్లలో తమన్నా భాటియా అత్యధిక మొత్తం రెమ్యునరేషన్ తీసుకుంటున్న స్టార్‌గా నిలిచింది.



# నా హైట్‌తో సమస్య.. నాతో ఎవరూ మాట్లాడేవాళ్లు కాదు..

## - మీనాక్షి చౌదరి

గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం'.. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'.. ఇలా వరుస సంక్రాంతి సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి, వచ్చే ఏడాది కూడా సంక్రాంతికి వచ్చి, హ్యాట్రిక్ హిట్‌తో అలరిస్తానంటున్న నటి మీనాక్షి చౌదరీ చెప్పిన కొన్ని ఆసక్తికర విషయాలు మీకోసం.. ఇంకేందుకు ఆలస్యం చదివేయండి. పెద్ద పెద్ద స్టార్స్‌తో చేసిన సినిమాలు కొంత నిరాశపరచిన మాట నిజమే! కొందరు వాటి ఫ్లాప్స్‌కి నన్ను బాధ్యురాలిని చేస్తూ కామెంట్స్ చేశారు. ఫ్లాప్‌కి బాధపడను, ఎందుకంటే మన పని మాత్రమే మనల్ని ముందుకి తీసుకెళ్తుంది. తెలుగులో నా ఫస్ట్ పిక్చర్ 'ఇచ్చట వాహనములు నిలపరాదు' వర్కవుట్ కాకపోయినా.. ఖిలాడీ సినిమాలో ఛాన్స్ రావడానికి అదే కారణం! లక్కీ భాస్కర్ సినిమాతో నా లక్ మారిందని చాలామంది అంటున్నారు. ఆ సినిమా నాకు బాగా నచ్చింది. కానీ.. ఇక ముందు పిల్లల తల్లి పాత్ర వస్తే నో చెప్పేస్తాను. నేను పంజాబీ అమ్మాయిని. మా నాన్న బీఆర్ చౌదరి ఆర్మీలో కర్నల్. ఆయన క్రమశిక్షణకి చాలా ప్రాధాన్యం ఇచ్చేవారు. నన్ను తరచు తిడుతుండే వారు. ఇప్పడు షూటింగ్‌కి అందరి కన్నా ముందు వచ్చి కూర్చోవడానికి ఆయనే కారణం. నువ్వు కొంచెం లేట్‌గా రావచ్చు కదా అంటారు యూనిట్ వాళ్లు. చిన్నప్పుడు నేను చాలా ఇంట్రావర్ట్‌ని. కాలేజీలోకి వచ్చేటప్పటికే, నా ఎత్తు 6.2. దీంతో, అమ్మాయిలు కూడా నాతో కలిసి నడవటానికి, మాట్లాడటానికి ఇష్టపడే వాళ్లు కాదు. రకరకాల కామెంట్స్ చేసేవారు. చాలా బాధగా అనిపించేది. మా నాన్నకి చెప్పినా నీ సమస్యలు నువ్వే సాల్వ్ చేసుకోవాలి అనే వారు. బుక్స్ విపరీతంగా చదివేదాన్ని. అవే నా ఫ్రెండ్స్. అందాల పోటీల్లో, స్పోర్ట్స్ కాంపిటీషన్‌లో పాల్గొనడానికి నలుగురు కలుస్తారనేదే కారణం. నేను బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌లో ఛాంపియన్‌ని. మయాన్మార్‌లో జరిగిన అందాల పోటీల్లో నేను ఫస్ట్ రన్నర్‌గా వచ్చాను. ఈ మధ్య మయాన్మార్ లో భూకంపం వచ్చినప్పడు నా మనసు కలచివేసినట్లయింది. సీనియర్ హీరోలతో నటించడంలో నాకెలాంటి ప్రాబ్లెమ్స్ లేవు. అదో జోనర్‌గా భావిస్తాను. వెంకటేష్‌గారితో సంక్రాంతికి వస్తున్నాం చేయడం చాలా ఎంజాయ్ చేశాను. ఇప్పడు మెగాస్టార్ చిరంజీవిగారితో విశ్వంభర చేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. నా మీద రూమర్స్ వచ్చినప్పడు కోపం వస్తుంది. నేను సోషల్ మీడియాలో ఎప్పడూ అందుబాటులో ఉంటాను. ఏదన్నా ఉంటే నేనే అనౌన్స్ చేస్తాను. పంజాబీ అమ్మాయిని అయినప్పటికీ.. సౌత్ ఇండియన్ కల్చర్ బాగా నచ్చుతుంది. చీరలు కట్టుకోవడం చాలా కంఫర్ట్‌గా ఉంటుంది. నేను డెంటిస్ట్‌ని. ఎవరిని అయినా ఫస్ట్ టైమ్ కలిసినప్పుడు వెంటనే వాళ్ల దంతాలనే గమనిస్తుంటాను. నిజానికి డెంటిస్ట్‌గా ప్రాక్టీసు మొదలు పెట్టాను. కాని, హీరోయిన్‌గా బిజీ కావడంతో సాధ్యపడలేదని అంటోంది మీనాక్షి చౌదరి.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

# బుమ్ బుమ్ బుమ్రా.. లక్నోను చిత్తు చేసిన ముంబై



ఐపీఎల్2025లో ముంబై ఇండియన్స్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఆదివారం వాంఖడే వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇది ముంబైకి వరుసగా ఐదో విజయం కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో రికెల్టన్(58), సూర్యకుమార్ యాదవ్(54) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. వీరితో పాటు నమన్ ధీర్(25), జాక్స్(29), బాష్(20) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. లక్నో బౌలర్లలో మయాంక్ యాదవ్, అవేష్ ఖాన్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు.

**బుమ్ బుమ్ బుమ్రా..**

అనంతరం 216 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. ముంబై బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరిగాడు. నాలుగు వికెట్లు పడగొట్టి లక్నోను దెబ్బ తీశాడు. బుమ్రాతో పాటు ట్రెంట్ బౌల్ట్ మూడు, విల్ జాక్స్ రెండు, బాష్ ఓ వికెట్ సాధించారు. లక్నో బ్యాటర్లలో ఆయూష్ బదోని(35) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిచెల్ మార్ష్(34) పర్వాలేదన్పించాడు. ఈ విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది.

# కృనాల్ ఆల్‌రౌండ్ షో..

## ఢిల్లీపై ప్రతీకారం తీర్చుకున్న ఆర్సీబీ



ఐపీఎల్2025లోరాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ మెగా టోర్నీలో బాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది. 163 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 18.3 ఓవర్లలో చేధించింది. 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని కృనాల్ పాండ్యా, విరాట్ కోహ్లి తమ అద్భుత ఇన్నింగ్స్‌లతో విజయతీరాలకు చేర్చారు. కృనాల్ 46 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 పరుగులు చేయగా.. విరాట్ 46 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 51 పరుగులు చేశాడు. ఆఖరిలో టిమ్ డేవిడ్(5 బంతుల్లో 19) మెరుపులు మెరిపించాడు. ఈ విజయంతో చిన్నస్వామి స్టేడియంలో ఢిల్లీ చేతిలో ఎదురైన పరాభావానికి ఆర్సీబీ బదులు తీర్చుకుంది. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ రెండు వికెట్లు పడగొట్టగా.. చమీరా ఓ వికెట్ సాధించాడు. మరో వికెట్ రనౌట్ రూపంలో లభించింది. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్(41) టాప్ స్కోరర్‌గా నిలవగా.. స్టబ్స్(34),ఫాఫ్ డుప్లెసిస్(22), అభిషేక్ పోరెల్(28) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టగా.. హాజిల్‌వుడ్ రెండు, దయాల్, పాండ్యా తలా వికెట్ సాధించారు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానికి చేరుకుంది.

# జస్ప్రీత్ బుమ్రా సరికొత్త చరిత్ర... తొలి బౌలర్‌గా



ఐపీఎల్2025లో వాంఖడే స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్ ఘన విజయం సాధించింది. ఈ విజయంలో ముంబై స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాది కీలక పాత్ర. 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. తన పేస్ బౌలింగ్‌తో లక్నో బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. బుమ్రా తన బౌలింగ్‌లో కోటాలో కేవలం 22 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో బుమ్రా ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా జస్ప్రీత్ రికార్డులకెక్కాడు. ముంబై ఇండియన్స్ తరపున ఇప్పటివరకు 139 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా.. 174 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ లసిత్ మలింగ రికార్డు పేరిట ఉండేది. మలింగ 122 మ్యాచ్ ల్లో 170 వికెట్లు తీశాడు. ఇప్పుడు తాజా మ్యాచ్‌తో మలింగ రికార్డును బుమ్ బుమ్రా బ్రేక్ చేశాడు. అయితే ఐపీఎల్‌తో పాటు ఛాంపియన్స్ లీగ్ కూడా కలిపితే ముంబై తరపున అత్యధిక వికెట్ల వీరుడిగా మలింగ కొనసాగుతున్నాడు. ఈ శ్రీలంక దిగ్గజం రెండు లీగ్‌లు కలిపి ముంబై తరపున 195 వికెట్లు పడగొట్టాడు. మలింగ తర్వాతి స్థానంలో బుమ్రా(177) ఉన్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో రికెల్టన్(58), సూర్యకుమార్ యాదవ్(54) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. వీరితో పాటు నమన్ ధీర్(25), జాక్స్(29), బాష్(20) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. లక్నో బౌలర్లలో మయాంక్ యాదవ్, అవేష్ ఖాన్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 216 పరుగుల భారీ లక్ష్య చేధనలో లక్నో చతకలపడింది. 20 ఓవర్లో 61 పరుగులకు ఆలౌటైంది. లక్నో బ్యాటర్లలో ఆయూష్ బదోని(35) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిచెల్ మార్ష్(34) పర్వాలేదన్పించాడు. ముంబై బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లు పడగొట్టగా..ట్రెంట్ బౌల్ట్ మూడు, విల్ జాక్స్ రెండు, బాష్ ఓ వికెట్ సాధించాడు.

# ముంబై ఓపెనర్ విధ్వంసం.. ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ



ఐపీఎల్2025లో వాంఖడే స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్ రికెల్టన్ విధ్వంసం సృష్టించాడు. రికెల్టన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ దక్షిణాఫ్రికా బ్యాటర్ క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో రికెల్టన్ కేవలం 25 బంతుల్లోనే తన రెండో ఐపీఎల్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 32 బంతులు ఎదుర్కొన్న రికెల్టన్.. 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 58 పరుగులు చేసి ఔటయ్యాడు. అయితే అద్భుతమైన హాఫ్ సెంచరీతో మెరిసిన రికెల్టన్ ఓ రికార్డ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా రికెల్టన్ రికార్డులకెక్కాడు. ఇంతకుముందు ఈ రికార్డు తిలక్ వర్మ పేరిట ఉండేది. ఈ ఏడాది సీజన్‌లో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో వర్మ కేవలం 26 బంతుల్లో అర్థ శతకం సాధించాడు. తాజా మ్యాచ్‌తో వర్మను రికెల్టన్ అధిగమించాడు. ఇక ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో రికెల్టన్(58), సూర్యకుమార్ యాదవ్(54) హాఫ్ సెంచరీలతో మెరవగా.. నమన్ ధీర్(25), జాక్స్(29), బాష్(20) రాణించారు. లక్నో బౌలర్లలో మయాంక్ యాదవ్, అవేష్ ఖాన్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు ప్రిన్స్ యాదవ్, దిగ్వేష్, బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com